తెలంగాణ TELANGANA MUCHATLU

# ముచ్చట్లు

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | శనివారం - 09 - మే - 2026 | సంపుటి : 3 | సంచిక : 341 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in




## మైనారిటీ విద్యార్థులకు
# ప్రత్యేక డిగ్రీ కళాశాలలు

**నైపుణ్యాభివృద్ధి, ఏఐ శిక్షణపై సీఎం రేవంత్ దృష్టి**

**జీవనోపాధికి ఉపయోగపడే విద్య అందించాలని ఆదేశం**

**మైనారిటీ సంక్షేమ శాఖపై సీఎం సమీక్ష**

**హైదరాబాద్, మే 8 (తెలంగాణ ముచ్చట్లు):**
మైనారిటీ విద్యార్థుల కోసం ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ కళాశాలల్లో నైపుణ్యాభివృద్ధి, కృత్రిమ మేధస్సు శిక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మైనారిటీ సంక్షేమ శాఖపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి ఈ ఆదేశాలు జారీ చేశారు. సంప్రదాయ కోర్సులకు మాత్రమే పరిమితం కాకుండా విద్యార్థుల జీవనోపాధికి ఉపయోగపడే శిక్షణ అందించాలని పేర్కొన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అందిస్తున్నట్లే ప్రతిభావంతులైన మైనారిటీ విద్యార్థులకు కూడా ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించాలని సీఎం సూచించారు. ఇందుకోసం ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్3 పరీక్షల్లో ఎంపికైన మైనారిటీ అభ్యర్థుల్లో ఆసక్తి ఉన్న వారిని ఎంపిక చేసి మైనారిటీ సంక్షేమ శాఖలో బాధ్యతలు అప్పగించాలని సీఎం సూచించారు. శాఖ చేపట్టే కార్యక్రమాలపై పూర్తి అవగాహన కలిగేలా వారిని తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. విద్యార్థులకు ప్రోత్సాహక కార్యక్రమాల్లో గ్రూప్స్‌లో ఎంపికైన అభ్యర్థులు, క్రీడాకారులను ఆహ్వానించి విద్య, క్రీడల ప్రాధాన్యతను వివరించాలని సూచించారు. ఇమామ్‌లు, మౌజమ్‌లకు అందించే గౌరవ వేతనాలను క్రమం తప్పకుండా

మిగతా 2లో..



## ఆటోలను ఈవీలుగా మార్చేందుకు
# ప్రభుత్వ సహాయం

**కాలుష్య రహిత హైదరాబాద్ లక్ష్యంగా సీఎం రేవంత్**

**హజ్ యాత్రికుల బస్సులకు జెండా ఊపిన ముఖ్యమంత్రి**

**హాజీల అదనపు భారాన్ని భరిస్తామని ప్రకటన**

**హైదరాబాద్, మే 8 (తెలంగాణ ముచ్చట్లు):**
హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు నగరంలోని ఆటోలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. కోర్ అర్బన్ రీజియన్‌లో ఉన్న ఆటోలకు ప్రభుత్వ నిధులతో రెట్రో ఫిట్టింగ్ చేయించేందుకు ఐదు కంపెనీలతో చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. హైదరాబాద్ హజ్ హౌజ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి హజ్ యాత్రకు బయలుదేరుతున్న యాత్రికుల బస్సులకు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మహ్మద్ అజహరుద్దీన్, ఎంపీలు అసదుద్దీన్ ఒవైసీ తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.
సభలో మాట్లాడిన ముఖ్యమంత్రి హజ్ యాత్రకు వెళ్తున్న యాత్రికులకు తెలంగాణ ప్రభుత్వం తరపున శుభాకాంక్షలు తెలిపారు. మైనారిటీల సంక్షేమం, అభివృద్ధి విషయంలో ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. హిందూ, ముస్లింలు తనకు రెండు కళ్ల లాంటి వారని, ఇద్దరూ అన్నదమ్ముల్లా కలిసి తెలంగాణ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మైనారిటీల నిష్పత్తికి అనుగుణంగా సంక్షేమ పథకాల లబ్ధి అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని సీఎం తెలిపారు.

మిగతా 2లో..

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రం
# పరిశీలించిన మంత్రి అడ్లూరి

- రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు పూర్తి చేయాలి
- అకాల వర్షా లపై అప్రమత్తంగా ఉండాలని సూచన
- రైతులకు భరోసా కల్పిస్తామని హామీ

**జగిత్యాల, మే 8 (తెలంగాణ ముచ్చట్లు):** జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీట్ బజార్‌లో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వయోవృద్ధులు, వికలాంగులు, ట్రాన్స్‌జెండర్ సాధికారిత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌తో కలిసి కేంద్రంలోని ఏర్పాట్లను పరిశీలించారు.

మిగతా 2లో..



## రాష్ట్రంలో శాంతిభద్రతలు
# క్షీణించాయి

- కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శలు
- పోలీస్ వ్యవస్థను రాజకీయాలకు వాడుకుంటున్నారని ఆరోపణ
- ప్రజల భద్రతపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని డిమాండ్

**హైదరాబాద్, మే 8 (తెలంగాణ ముచ్చట్లు):**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా వరుసగా జరుగుతున్న నేర ఘటనలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.
పోలీస్ యంత్రాంగాన్ని రాజకీయ కక్షసాధింపులకు, ప్రతిపక్ష నాయకులను వేధించడానికి వినియోగిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. ప్రజల భద్రత, రక్షణ పూర్తిగా నిర్లక్ష్యానికి గురవుతోందని అన్నారు. శాంతిభద్రతల పరిస్థితిపై బీఆర్ఎస్ ప్రతినిధి బృందం డీజీపీని కలిసి ఫిర్యాదు చేస్తున్న సమయంలోనే హైదరాబాద్ ప్రశాసన్ నగర్‌లో రిటైర్డ్ డీజీ ర్యాంక్ ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రాయ్ భార్య హత్యకు గురవడం దిగ్భ్రాంతికరమని పేర్కొన్నారు.
అదే విధంగా సికింద్రాబాద్‌లో నడిరోడ్డుపై యువకుడిని కత్తితో పొడిచి చంపిన ఘటన ప్రజల్లో భయాందోళనలు పెంచిందని అన్నారు. ఇటువంటి సంఘటనలు రాష్ట్రంలో పెరుగుతున్న అభద్రతా పరిస్థితులకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. నేరాల నియంత్రణ, ప్రజా భద్రతపై దృష్టి పెట్టాల్సిన పోలీస్, ఇంటెలిజెన్స్ వ్యవస్థలను ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వాన్ని విమర్శించే సోషల్ మీడియా వేదికలపై కేసులు పెట్టడానికి వినియోగిస్తోందని ఆరోపించారు.




పోలీస్ వ్యవస్థను రాజకీయ అవసరాలకు వాడుకోవడం వల్లే శాంతిభద్రతలు కుప్పకూలాయని కేటీఆర్ అన్నారు. మహిళలపై నేరాలు, సైబర్ నేరాలు రాష్ట్రంలో భారీగా పెరిగాయని తాజా ఎన్‌సీఆర్‌బీ నివేదికలను ప్రస్తావించారు. హోంశాఖను కూడా తన వద్దే ఉంచుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడటంలో విఫలమయ్యారని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే రాజకీయ వేధింపులు ఆపి పోలీసింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల్లో భరోసా కల్పించేలా పోలీసులు వృత్తిపరంగా పనిచేసే పరిస్థితులు కల్పించాలని కేటీఆర్ ప్రభుత్వాన్ని కోరారు.



## రైతుల కోసం
# పాదయాత్ర చేస్తాం

**మహబూబ్‌నగర్‌లో రైతులతో శ్రీనివాస్ గౌడ్ భేటీ**

**ప్రతి గింజను ప్రభుత్వం కొనాలని డిమాండ్**

**కాంగ్రెస్ రైతులను మోసం చేసిందని ఆరోపణ**

**మహబూబ్‌నగర్, మే 8 (తెలంగాణ ముచ్చట్లు):** రైతుల్లో భరోసా నింపేందుకు త్వరలో పాదయాత్ర చేపడతామని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ప్రకటించారు. మహబూబ్‌నగర్ మండల పరిధిలోని రాంరెడ్డిగూడెం మిల్లు వద్ద వడ్లు అమ్మకం కోసం వాహనాల్లో సంచులు పెట్టుకొని ఎదురు చూస్తున్న రైతులతో ఆయన మాట్లాడారు. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. రైతుల సమస్యలపై పార్టీ ముఖ్య నాయకులతో సమావేశమై త్వరలోనే పాదయాత్రకు సంబంధించిన ప్రణాళిక విడుదల చేస్తామని తెలిపారు. పాదయాత్ర ద్వారా ప్రతి రైతును కలుసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు చేసిన అన్యాయాన్ని వివరిస్తామని చెప్పారు. రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వాలని, సకాలంలో యూరియా, విద్యుత్ సరఫరా చేయాలని, రైతు బంధు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు

మిగతా 2లో..



# రిటైర్డ్ ఐపీఎస్ భార్య హత్య కేసులో సంచలనం

**పనిమనిషిపైనే హత్య ఆరోపణలు**

**బంగారం, నగదుతో పరారైన నిందితులు**

**దర్యాప్తును పర్యవేక్షించిన డీజీపీ**

**హైదరాబాద్, మే 8 (తెలంగాణ ముచ్చట్లు):**
హైదరాబాద్‌లో రిటైర్డ్ ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రే భార్య సునంద హత్య కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ కేసులో ఇంట్లో పనిచేస్తున్న నేపాల్‌కు చెందిన పనిమనిషి కల్పన ప్రధాన నిందితురాలిగా పోలీసులు గుర్తించారు. పోలీసుల వివరాల ప్రకారం.. కల్పన మరో ఇద్దరితో కలిసి ముందస్తు ప్రణాళిక ప్రకారమే ఈ హత్యకు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. సునందను హత్య చేసిన అనంతరం ఇంట్లో ఉన్న బంగారం, నగదును బ్యాగుల్లో సర్దుకుని ముగ్గురు అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు వెల్లడించారు. ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. ఇంట్లోని సీసీటీవీ దృశ్యాలు, ఇతర సాంకేతిక ఆధారాల ఆధారంగా దర్యాప్తును వేగవంతం చేశారు. ఈ కేసు తీవ్ర సంచలనం రేపడంతో రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్, నగర పోలీసు కమిషనర్ సజ్జనార్ స్వయంగా ఘటనాస్థలాన్ని పరిశీలించారు. దర్యాప్తు పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించి కీలక ఆదేశాలు జారీ చేశారు. నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు. హత్యకు గల పూర్తి కారణాలు దర్యాప్తులో వెలుగులోకి వచ్చే అవకాశముందని పేర్కొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# రైతుల కోసం పాదయాత్ర చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

చేయాలని స్పష్టం చేశారు. పంట కొనుగోలు సకాలంలో జరగకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేయాలని కూడా డిమాండ్ చేశారు. రైతు మరణిస్తే రైతు బీమా వెంటనే అందించాలని కోరారు. రైతుల సమస్యలను పట్టించుకోని ప్రభుత్వంపై ప్రజలతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ వరంగల్ సభ ప్రకటన వచ్చిన వెంటనే ప్రభుత్వం పాత పద్ధతిలో పంట కొనుగోళ్లు ప్రారంభించిందని ఆరోపించారు. ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాల వల్ల మిల్లర్లు రైతుల నుంచి అధిక తరుగు తీసుకుంటున్నారని చెప్పారు. రెండు నుంచి మూడు కిలోల వరకు తరుగు తీస్తున్నట్లు రైతులు తనకు తెలిపారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. మూడు సార్లు రైతు బంధు ఇవ్వలేదని, వ్యవసాయానికి సరిపడా కరెంటు, యూరియా అందించలేదని ఆరోపించారు. రైతులు కష్టపడి పంట పండించినా ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదన్నారు. అరకొర కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. మిల్లుల వద్ద కూడా కొనుగోళ్లు సరిగా జరగడం లేదని చెప్పారు. ప్రైవేట్ వ్యాపారులు 40 కేజీలకు మూడు నుంచి నాలుగు కిలోల వరకు తరుగు తీస్తూ రైతులను నష్టపరుస్తున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కల్లాల వద్దే వడ్లు కొనుగోలు చేశామని, తడిసిన ధాన్యాన్ని కూడా తీసుకున్నామని గుర్తు చేశారు. రైతులకు సకాలంలో డబ్బులు చెల్లించామని తెలిపారు. ఇప్పుడు రైతు వారోత్సవాలు ఎందుకు నిర్వహిస్తున్నారో కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పాలని ప్రశ్నించారు. ప్రజా సమస్యలు పరిష్కరించకుండా నాయకులను డబ్బులతో కొనుగోలు చేయాలని ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. రైతులు, ప్రజలు, విద్యార్థులను డబ్బులతో కొనలేరని స్పష్టం చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యపై పోరాడి ప్రభుత్వం మెడలు వంచేలా చేస్తామని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు.

# ఆటోలను ఈవీలుగా మార్చేందుకు ప్రభుత్వ సహాయం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర అభివృద్ధిలో మైనారిటీల భాగస్వామ్యాన్ని మరింత పెంచేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా యువత ఉపాధిపై కూడా ముఖ్యమంత్రి మాట్లాడారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రభావంతో వైట్ కాలర్ ఉద్యోగాలకు ముప్పు పెరుగుతోందని, అందువల్ల నైపుణ్యాభివృద్ధిపై యువత దృష్టి పెట్టాలని సూచించారు. స్కిల్స్ యూనివర్సిటీలు, పాలిటెక్నిక్, శిక్షణా కేంద్రాల్లో చదివి ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. అమెరికా, మిడిల్ ఈస్ట్ దేశాలతో పాటు జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా వంటి దేశాల్లో కూడా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని చెప్పారు. యువత ప్రపంచ స్థాయి నైపుణ్యాలు సంపాదించాలని సూచించారు. ఇరాన్ యుద్ధ పరిస్థితుల కారణంగా పెట్రోల్ ధరలు పెరిగాయని చూపిస్తూ హజ్ యాత్రికులపై ఒక్కొక్కరికి రూ.10 వేల అదనపు భారం మోపారని సీఎం పేర్కొన్నారు. ఈ భారాన్ని భరించలేని పరిస్థితి ఉన్నందున 7 వేల మంది హాజీలపై పడిన అదనపు వ్యయాన్ని ప్రభుత్వం భరిస్తుందని ప్రకటించారు. గత ఏడాది హజ్ యాత్ర సందర్భంగా జరిగిన బస్సు ప్రమాదంలో 44 మంది మరణించిన విషయాన్ని గుర్తుచేసిన ముఖ్యమంత్రి, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున పరిహారం అందించిందని తెలిపారు. మైనారిటీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

# మైనారిటీ విద్యార్థులకు ప్రత్యేక డిగ్రీ కళాశాలలు

(మొదటి పేజీ తరువాయి)

విడుదల చేయాలని అధికారులకు ఆదేశించారు.

భూమి అందుబాటులో ఉన్న చోట ఖబర్స్తాన్‌లకు స్థలాలు కేటాయిస్తామని సీఎం తెలిపారు. డీజిల్, పెట్రోల్ ఆటోలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చే రెట్రోఫిట్టింగ్ ప్రణాళిక ద్వారా ఆటోడ్రైవర్ల ఇంధన వ్యయాన్ని తగ్గించి వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని పేర్కొన్నారు. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులో భాగంగా గుడి, మసీదు, చర్చి, గురుద్వారా నిర్మాణాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భారత దేశ వైవిధ్య సంస్కృతిని, తెలంగాణ గంగాజమునా తెహజీబ్ సంప్రదాయాన్ని ప్రతిబింబించేలా ఆ నిర్మాణాలు ఉండాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో మంత్రి మహ్మద్ అజహరుద్దీన్, ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రం పరిశీలించిన మంత్రి అడ్లూరి

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రైతుల నుంచి మొక్కజొన్న కొనుగోలు విధానం, తేమ శాతం పరీక్షలు, తూకం ప్రక్రియ, నిల్వలు, రవాణా తదితర అంశాలపై అధికారుల పనితీరును పరిశీలించినట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులు తీసుకువచ్చే మొక్కజొన్నకు సరైన ధర లభించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకత పాటిస్తూ రైతులకు సమయానికి చెల్లింపులు జరిగేలా చూడాలని సూచించారు. జిల్లాలో అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని, టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ప్రకృతి రైతులపై కన్నెర్ర చేస్తే ప్రజా ప్రభుత్వం అండగా నిలిచి భరోసా కల్పిస్తుందని మంత్రి స్పష్టం చేశారు. వర్షాలు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి ఉన్నందున రైతులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని పేర్కొన్నారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని కోరారు. అకాల వర్షాల వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ భరోసా కల్పిస్తానని అన్నారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. కేంద్రాల్లో తాగునీరు, నీడ, తూకం యంత్రాలు తదితర సౌకర్యాలు అందుబాటులో ఉంచామని చెప్పారు. తడిసిన ధాన్యాన్ని సరైన విధంగా ఆరబెట్టాలని, టార్పాలిన్ కవర్లు సిద్ధంగా ఉంచుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రకాష్, మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి, మార్కెట్ కమిటీ సభ్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుకు మళ్లీ ఊపు

## ఆదిలాబాద్‌లో ప్రాజెక్టు పరిశీలన

**ఆదిలాబాద్, మే 8 (తెలంగాణ ముచ్చట్లు):** ఆదిలాబాద్ జిల్లాలోని తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును మంత్రి జూపల్లి కృష్ణారావు సహచర మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులతో కలిసి ప్రాజెక్టు పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడిహెట్టి బరాజ్‌కు 2008లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి భూమిపూజ చేశారని మంత్రి గుర్తు చేశారు. రూ.38,500 కోట్ల అంచనా వ్యయంతో 16 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును ప్రారంభించారని తెలిపారు. ప్రాజెక్టు పరిధిలో 106 కిలోమీటర్ల కాల్వ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయగా, ఇప్పటికే 71.5 కిలోమీటర్ల మేర భూసేకరణ పూర్తయిందన్నారు. అలాగే 46 కిలోమీటర్ల కాల్వ నిర్మాణ పనులు కూడా పూర్తయ్యాయని వెల్లడించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పక్కనపెట్టి కాళేశ్వరం ప్రాజెక్టుపై దృష్టి పెట్టిందని మంత్రి విమర్శించారు. గ్రావిటీ ద్వారా తరలించాల్సిన నీటిని పంపుల ద్వారా ఎత్తిపోసే విధానంతో భారీ ఆర్థిక భారం పెరిగిందని అన్నారు. సిర్పూర్, ఆసిఫాబాద్, బెల్లంపల్లి, చెన్నూరు నియోజకవర్గాల రైతులకు ప్రయోజనం చేకూర్చేందుకు తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును పునరుద్ధరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారని తెలిపారు. మహారాష్ట్ర ప్రభుత్వంతో త్వరలో చర్చలు జరిపి ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. భూములు కోల్పోయే రైతులకు తగిన పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మేడిగడ్డ ప్రాజెక్టు పిల్లర్లు కుంగిపోవడంతో ఆ నీటిని వినియోగించుకునే అవకాశం తగ్గిందని, తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ద్వారా గ్రావిటీ పద్ధతిలో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు నీటిని తరలిస్తామని మంత్రి వెల్లడించారు.

# రైతాంగాన్ని మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి




**హైదరాబాద్,మే8(తెలంగాణ ముచ్చట్లు):** కేటీఆర్‌పై వరంగల్‌లో కేసు నమోదు, కాంగ్రెస్ ఎమ్మెల్యేల వ్యాఖ్యలు, పంట కొనుగోళ్లలో అలసత్వం, అకాల వర్షాలతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, మక్క రైతులకు గిట్టుబాటు ధర లేకపోవడం వంటి అంశాలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తూ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో యూరియా షాపుల్లో కాకుండా యాప్‌ల్లో మాత్రమే కనిపిస్తోందని విమర్శించారు. రైతులు మండుటెండల్లో రోడ్లపై వడ్లు పోసి కొనుగోళ్ల కోసం పడిగాపులు కాస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఢిల్లీకి మూటలు మోయడంపై ఉన్న శ్రద్ధ ఐకేపీ కేంద్రాల్లో ఉన్న ధాన్యం కొనుగోలుపై లేదని ఆరోపించారు.

రైతుల సమస్యలపై ప్రశ్నించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై అక్రమ కేసులు పెట్టారని విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో తుపాకీ తూటాలకు ఎదురొడ్డి పోరాడిన నాయకుడు రైతుల కోసం జైలుకు వెళ్లడానికైనా సిద్ధమేనని పేర్కొన్నారు.

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. రైతు డిక్లరేషన్ పేరుతో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రైతులను మోసం చేసిందన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చారని, ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో మళ్లీ పాత పరిస్థితులు వచ్చాయని అన్నారు.

సివిల్ సప్లై శాఖలో భారీ అవినీతి జరిగిందని, హైకోర్టు నోటీసులు రావడంతో రుణాలు కూడా రావడం లేదని ఆరోపించారు. అందువల్లే ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరగడం లేదన్నారు. తెలంగాణలో దోచుకున్న డబ్బును కాంగ్రెస్ దేశవ్యాప్తంగా ఎన్నికల్లో ఖర్చు చేస్తోందని విమర్శించారు.

మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, మద్దతు ధరతో పాటు బోనస్ కలిపి రావాల్సిన ధర రాకపోవడంతో రైతులు తక్కువ ధరకే పంట అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. దళారులు రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి నకిలీ పట్టాలతో అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు.

వరంగల్ రైతు సంగ్రామ సభకు భారీగా రైతులు హాజరయ్యారని, కాంగ్రెస్ నిర్వహించిన రైతు మేళాకు మాత్రం స్పందన లేకపోయిందన్నారు. ఆ అక్కసుతోనే కేటీఆర్‌పై కేసులు పెట్టారని విమర్శించారు. రైతుల కోసం పోరాడడంలో వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు.

రుణమాఫీ అమలులో కుటుంబాన్ని ప్రామాణికంగా తీసుకోవడం వల్ల చాలా మంది రైతులకు అన్యాయం జరిగిందన్నారు. రైతు బంధు, రైతు బీమా వంటి పథకాలు కూడా నిర్వీర్యమయ్యాయని ఆరోపించారు. యూరియా సకాలంలో అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని, మార్కెట్ల నుంచి తరలించిన ధాన్యాన్ని సకాలంలో దిగుమతి చేయాలని, రైతు డిక్లరేషన్‌లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# తిరిగి బాధ్యతలు చేపట్టిన పెద్దమందడి సింగిల్ విండో పాలకమండలి



- హర్షం వ్యక్తం చేసిన అధ్యక్షులు, డైరెక్టర్లు

**పెద్దమందడి,మే8(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి వ్యవసాయ సింగిల్ విండో పాలక మండలి సమావేశం శుక్రవారం నిర్వహించారు.ఇటీవల సింగిల్ విండో పాలకమండలిని ప్రభుత్వం రద్దు చేయగా, ఆ నిర్ణయంపై హైకోర్టు తీర్పు వెలువడింది.అనంతరం తిరిగి పదవి బాధ్యతలు స్వీకరించిన పాలకమండలి సభ్యులు సమావేశం నిర్వహించి హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సింగిల్ విండో అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం కోసం పాలకమండలి కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు.సహకార సంఘాల పరిరక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను అభినందిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఉపాధ్యక్షులు, డైరెక్టర్లు మాట్లాడుతూ.. తిరిగి బాధ్యతలు చేపట్టడం ఆనందంగా ఉందన్నారు.రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు సమిష్టిగా కృషి చేస్తామని పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాల పరిరక్షణే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు.సమావేశంలో సింగిల్ విండో అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్, పాలకమండలి సభ్యులు నరేష్, రామ్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, సుందరమ్మ, వెంకటయ్య, మన్నెంకొండ,సీఈవో సుధాకర్, సహకార సంఘం సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్లపై పంటలు ఆరబెట్టడమే ఇద్దరి మృతికి కారణమా..?



- అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు..



**జమ్మికుంట టౌన్ మే 08 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లా జమ్మికుంట సమీపంలోని వల్లాపూర్ - జగ్గయ్యపల్లె మధ్య గురువారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందడం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. మరో యువకుడు ప్రాణాపాయ స్థితిలో వరంగల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

స్థానికుల కథనం ప్రకారం, బైక్‌పై ముగ్గురు ప్రయాణిస్తుండగా రహదారిపై ఉన్న ఎడ్లబండిని ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. రాత్రి వేళల్లో రహదారులపై వరి ధాన్యం, మక్కజొన్న పంటలు ఆరబెట్టడం, సరైన హెచ్చరిక బోర్డులు లేకపోవడం వంటి కారణాలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఈ ఘటనపై తెలంగాణ రైతు సహాయ జిల్లా స్థాయి సహకార కార్యదర్శి చెల్పూరి రాములు తీవ్రంగా స్పందించారు. రహదారులను పంటల ఆరబెట్టే ప్రదేశాలుగా మార్చడం వల్ల అమాయకుల ప్రాణాలు బలవుతున్నాయని మండిపడ్డారు. రైతులకు అవగాహన కల్పించాల్సిన వ్యవసాయ శాఖ, మార్కెట్ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు.

రోడ్లపై పంటలు ఆరబెట్టకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని, ఫలితంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి రహదారులపై పంటలు ఆరబెట్టకుండా కఠిన నిబంధనలు అమలు చేయాలని, మృతి చెందిన కుటుంబాలకు తగిన సహాయ సహకారాలు అందించాలని డిమాండ్ చేశారు.

# జమ్మికుంటలో గుర్తుతెలియని వ్యక్తి మృతి.. వడదెబ్బ అనుమానం




**జమ్మికుంట టౌన్ మే 08 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పట్టణంలోని పోస్ట్ ఆఫీస్ ఏరియాలో గల వాటర్ ట్యాంక్ సమీపంలో గురువారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కనిపించడం స్థానికంగా కలకలం రేపింది. ఉదయం సుమారు 7 గంటల సమయంలో రోడ్డుపై ఓ వ్యక్తి మృతి చెందిన స్థితిలో కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.

సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు సుమారు 40 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తిగా గుర్తించారు. స్థానికుల వివరాల ప్రకారం, అతను గత 15 రోజులుగా జమ్మికుంటలో లేబర్ పని చేస్తూ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్నట్లు తెలిసింది.

బుధవారం రాత్రి సుమారు 9 గంటల సమయంలో సూపర్ డ్రెస్సెస్ షాప్ ముందు అతను పడుకొని ఉన్నట్లు స్థానికులు తెలిపారు. ఇటీవల నమోదవుతున్న తీవ్ర ఎండల నేపథ్యంలో వడదెబ్బ తగిలి అతను మృతి చెందినట్టుగా ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## నూతన వధూవరులకు మాజీ ఎంపీ నామ, ఎమ్మెల్సీ తాతా మధు ఆశీస్సులు



**ఖమ్మం బ్యూరో, మే 8(తెలంగాణ ముచ్చట్లు ):** ఇల్లందు వాస్తవ్యులు నామా సుధాకర్‌కరుణశ్రీ దంపతుల కుమారుడు నిరంజన్ వివాహం ఖమ్మం పట్టణంలోని చైతన్య నగర్ కాలనీకి చెందిన స్వర్ణ నాగేశ్వరరావులక్ష్మి దంపతుల కుమార్తె భావనతో ఖమ్మం బోనకల్ రోడ్డులోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో సాంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ వివాహ వేడుక ఆనందోత్సాహాల మధ్య సాగింది.ఈ వివాహానికి బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. వారి దాంపత్య జీవితం నిండు నూరేళ్లు అన్యోన్యంగా, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నామ కుటుంబ సభ్యులు నామ రామారావు, వెంకటేశ్వర్లు, నెల్లూరి శ్రీనివాసరావు, మాగం కోటేశ్వరరావు, సామినేని సతీష్, సాయిరాం, నాయకులు గొడ్డేటి మాధవరావు, మంకెన రమేష్, వాకదాని కోటేశ్వరరావు, రేగళ్ల కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొని వధూవరులకు అభినందనలు తెలిపారు.

## కాంగ్రెస్ మైనార్టీ నాయకులు మాజీద్‌ను పరామర్శించిన ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి



**ఖమ్మం బ్యూరో, మే 8(తెలంగాణ ముచ్చట్లు ):** నగరంలోని 42వ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ మైనార్టీ నాయకుడు షేక్. మాజీద్‌ను ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న మాజీద్ ప్రస్తుతం తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీ నేరుగా ఆయన ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.

ధైర్యంగా ఉండాలి

చికిత్స అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అడిగి తెలుసుకున్న ఎంపీ.. మాజీద్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పార్టీ కార్యకర్తలకు, నాయకులకు అండగా ఉంటామని ఈ సందర్భంగా ఆయన భరోసా ఇచ్చారు. ఎంపీ వెంట కాంగ్రెస్ పార్టీ డివిజన్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆధునీకరించిన కల్లూరు ఏసీపీ కార్యాలయాన్ని ప్రారభించిన పోలీస్ కమిషనర్



**ఖమ్మం బ్యూరో, మే 8(తెలంగాణ ముచ్చట్లు ):** ఆధునీకరించిన కల్లూరు అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కార్యాలయాన్ని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ప్రారంభించారు.

శుక్రవారం సత్తుపల్లి కి చేరుకున్న పోలీస్ కమిషనర్ కు ముందుగా ఏసీపీ వసుంధర యాదవ్ స్వాగతం పలికారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందన స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ... పోలీస్ సంక్షేమ కార్యక్రమంలో భాగంగా పోలీస్ అధికారులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో

గల సత్తుపల్లిలో ఆధునిక సదుపాయాలతో, సౌకర్యవంతమైన వాతావరణంలో ఏసీపీ కార్యాలయాన్ని పునర్నిర్మాణం చేపట్టామని తెలిపారు. ఏసీపీ కార్యాలయాల ఆధునీకరణ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించడం, కేసుల దర్యాప్తును వేగవంతం చేయడం, సైబర్ నేరాల కట్టడికి మరింత కృషి... రోడ్డు ప్రమాదాల నిర్మూలన, మాదకద్రవ్యాల కట్టడికి పటిష్టమైన చర్యలు చెప్పట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్ )రామానుజం, ఇన్స్పెక్టర్ శ్రీహరి, సిఐ ముత్తులింగం, కల్లూరు డివిజన్ ఎస్సైలు పాల్గొన్నారు.







# రక్తదానంపై మా సహకారం ఉంటుంది

- ఏసీపీ రమణమూర్తి, ఐఎంఏ అధ్యక్షురాలు రెహానాబేగం
- సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ తలసేమియా దినోత్సవం

**ఖమ్మం బ్యూరో,మే 8 (తెలంగాణ ముచ్చట్లు ):** 'తలసేమియా వ్యాధిగ్రస్తులకు రక్తం ఎక్కించడం ముఖ్యం. రక్తదానం విషయంలో మా సహకారం ఉంటుంది' అని ఏసీపీ రమణమూర్తి, ఐఎంఏ అధ్యక్షురాలు రెహానాబేగం అన్నారు. ప్రపంచ తలసేమియా దినోత్సవాన్ని శుక్రవారం సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఖమ్మంలోని ఓ హోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ రమణమూర్తి మాట్లాడుతూ సంకల్ప స్వచ్ఛంద సంస్థతో తనకు అనుబంధం ఉందని, తలసేమియా పిల్లల కోసం సంకల్ప స్వచ్ఛంద సంస్థకు పలుమార్లు రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. భవిష్యత్తులో కూడా శిబరాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. తలసేమియా చిన్నారులకు రక్తం కావాలంటే పోలీస్ శాఖ తరుపున తాము సహకరిస్తామని పేర్కొన్నారు. ఐఎంఏ అధ్యక్షురాలు రెహానాబేగం మాట్లాడుతూ తలసేమియా చిన్నారులు జీవితంలో మంచిగా చదువుకుని, ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. రక్తదానంతోపాటు ఇతర ఏ అంశంలోనైనా తమ సహకారం పిల్లలకు ఉంటుందని పేర్కొన్నారు. తలసేమియా అనేది జన్యుపరమైన వ్యాధి అని, దీనిని దృష్టిలో పెట్టుకుని గర్భిణిలు రొటీన్ హిమోగ్లోబిన్, ఎలక్ట్రోఫ్లోరోసిస్ టెస్ట్ చేయించుకోవాలని సూచించారు. దీని వల్ల మనది ఏ రకమైన హిమోగ్లోబిన్ అనేది తెలుస్తుందని, ఈ టెస్‌ట్‌కు ఎక్కువ డబ్బులు కూడా ఖర్చు కావని తెలిపారు. పెళ్లికి ముందు కూడా స్క్రీనింగ్ చేయించుకోవాలని తెలిపారు. ఏఆర్ ఏసీపీ నర్సయ్య మాట్లాడుతూ చిన్నారులను మాములు మనుషులుగానే చూడాలని, వారికి అవసరమైన మందులు, రక్తం అందిస్తూనే వారిలో ఉన్న ప్రతిభను వెలికితీయాలని అన్నారు. ఇందుకు తల్లిదండ్రుల పాత్ర కీలకమని అన్నారు. చిన్నారులకు అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన 'వివాహనికి ముందు హెచ్‌బిఏ 2 టెస్ట్' స్కిట్ ఆకట్టుకుంది. అలాగే చిన్నారులు పలు సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు. చిన్నారులకు అవసరమైన రక్తదానం, చికిత్సలకు ఆర్థికసాయం చేసిన దాతలను సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. తలసేమియా వ్యాది రహిత సమాజ నిర్మాణం కోసం ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సంస్థతో కలిసి పని చేస్తామని టీఎంసీ జి.సుజాత రాణి అన్నారు. సంస్థ ఫౌండర్ ప్రొద్దుటూరి అనిత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైద్యులు డి.నారాయణ మూర్తి, సతీష్ నారాయణ చౌదరి, మానస, బివిఎన్ కృష్ణ, నరేష్, లక్ష్మీ దీపా, శ్రావణి, మెప్మా ఖమ్మం సీవో ద్రౌపది, సంస్థ బాధ్యులు పి.పావని, పి.రవిచందర్, పి.ఉదయ్ భాస్కర్, పి.వంశీ కిరిటీ, పి.ప్రియ, అనురాధ, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# చివరి ధాన్యపు గింజ వరకు కొనుగోలు చేస్తాం

వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



**వనపర్తి,మే8(తెలంగాణ ముచ్చట్లు):** రైతులు పండించిన వరి ధాన్యాన్ని చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు.పెద్దమందడి మండలం వీరాయపల్లి గ్రామంలో రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా సంఘాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, పురపాలక మహిళా సంఘాలతో పాటు రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ప్రోత్సహించే ఉద్దేశంతో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ధాన్యం కొనుగోలు ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతోందని, లారీలు, గన్నీ సంచుల కొరత వంటి సమస్యలు ఎదురైతే అధికారులు వెంటనే పరిష్కరిస్తున్నారని చెప్పారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అప్రమత్తంగా పనిచేయాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు .ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రాజప్రకాశ్ రెడ్డి, మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యారెడ్డి, గ్రామ సర్పంచ్ వెంకటేష్, మాజీ జెడ్పిటిసి వెంకటస్వామిగట్టు యాదవ్, చిన్న మందార సర్పంచ్ స్వరూప, శ్రీశైలం, రాధాకృష్ణ, వివిధ గ్రామాల సర్పంచులు ప్రజా ప్రతినిధులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# పాపయ్యపల్లిలో భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా హనుమాన్ శోభాయాత్ర



**జమ్మికుంట రూరల్ మే 08 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట మండలం పాపయ్యపల్లి గ్రామంలో హనుమాన్ మాలధారణ స్వాముల ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి సందర్భంగా శ్రీ హనుమాన్ శోభాయాత్రను భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. "రామ లక్ష్మణ జానకి జై బోలో హనుమాన్ కి" అనే నినాదాలతో గ్రామమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

హనుమాన్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన ఈ శోభాయాత్రలో శ్రీ అభయాంజనేయ ఉత్సవమూర్తిని వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించి వాహనంపై అధిరోహింపజేశారు. అనంతరం గ్రామంలోని పుర వీధుల గుండా స్వామివారిని ఊరేగించారు. హనుమాన్ మాలధారణ స్వాములతో పాటు మహిళలు డప్పు చప్పుళ్లు, మేళతాళాలు, కోలాట నృత్యాలతో శోభాయాత్రను అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామ ప్రజలు, భక్తులు పెద్దఎత్తున హాజరై స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. రథయాత్రను భక్తిశ్రద్ధలతో తిలకించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు గుండెకారి మధు, శంకర్‌తో పాటు మాలాధారణ స్వాములు వజ్జపల్లి రాజు, కొల్లూరి రాకేష్, ఆరేపల్లి శివకృష్ణ, పవన్ కుమార్, మహేందర్, రాములు, సంతోష్, నరేష్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ తలసేమియా దినోత్సవం.. ప్రజల్లో అవగాహన అవసరం

**హుజురాబాద్, మే 08(తెలంగాణ ముచ్చట్లు ):** ప్రపంచ తలసేమియా దినోత్సవం సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రవణ్ కుమార్ తలసేమియా వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తలసేమియా అనేది జన్యుపరమైన రక్త రుగ్మత అని, ఇది శరీరంలో హిమోగ్లోబిన్ ఉత్పత్తిని ప్రభావితం చేస్తుందని తెలిపారు. ఈ వ్యాధి కారణంగా రక్తహీనత, అలసట, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు వంటి సమస్యలు ఎదురవుతాయని పేర్కొన్నారు.

తలసేమియా బాధితులు వైద్యుల సూచనల మేరకు తరచూ రక్త మార్పిడి చేయించుకుంటూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రజల్లో అవగాహన పెరిగితే వ్యాధిని నియంత్రించడంలో ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.

ప్రతి ఒక్కరూ తలసేమియా వ్యాధిపై సరైన అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ శ్రవణ్ కుమార్ కోరారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక

# రాజకీయ పురిటి గడ్డపై తుమ్మల 40 వసంతాల వేడుకలు

## సత్తుపల్లిలో అభిమానుల సంబరాలు



**సత్తుపల్లి, మే 8(తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి 40 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా, ఆయన రాజకీయ పుట్టినిల్లు అయిన సత్తుపల్లిలో "తుమ్మల 40 వసంతాల వేడుకలు" ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమం అభిమానులు, కార్యకర్తలు, ప్రజల సందడితో ఉత్సాహభరిత వాతావరణాన్ని సంతరించుకుంది. స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అభిమాన వారోత్సవాలకు రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు, తుమ్మల తనయుడు డాక్టర్ తుమ్మల యుగంధర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని మంత్రి తుమ్మలతో తమ నాలుగు దశాబ్దాల రాజకీయ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక ఏఐ ప్రదర్శన కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సత్తుపల్లి నియోజకవర్గంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను చిత్రాలు, వీడియోల రూపంలో ప్రజలకు ప్రదర్శించారు. రహదారుల విస్తరణ, సాగునీటి ప్రాజెక్టులు, విద్యా సంస్థల అభివృద్ధి, వైద్య రంగంలో చేపట్టిన సేవలను చూపించిన ఈ ప్రదర్శనను ప్రజలు ఆసక్తిగా వీక్షించారు. సత్తుపల్లి తుమ్మల గుండెలో ఉంటుంది అంటూ డాక్టర్ తుమ్మల యుగంధర్ భావోద్వేగంగా మాట్లాడారు. సత్తుపల్లి ప్రజల ప్రేమ, ఆదరణను తుమ్మల ఎప్పటికీ మరచిపోలేరు. ఆయన ఏ పదవిలో ఉన్నా, ఏ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించినా ఆయన ఆలోచన ఎప్పుడూ సత్తుపల్లి అభివృద్ధిపైనే ఉంటుంది అని పేర్కొన్నారు. నాలుగు దశాబ్దాల రాజకీయ ప్రస్థానాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తుమ్మల అభిమానులతో పాటు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు కూడా పాల్గొని కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమం మొత్తం తుమ్మల నినాదాలతో మార్మోగింది. రాజకీయాల్లో నిబద్ధత, అభివృద్ధి పట్ల అంకిత భావంతో ముందుకు సాగిన తుమ్మల ప్రయాణానికి ఈ వేడుకలు ప్రతీకగా నిలిచాయి.

# జై పొన్నం నినాదాలతో మారుమోగిన మాలపల్లె



**హుస్నాబాద్. మే 08 (తెలంగాణ ముచ్చట్లు):** హుస్నాబాద్ మండలం మాలపల్లె గ్రామంలో రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. మాలపల్లె గ్రామ సర్పంచ్ శ్రీమతి వెన్న స్వర్ణలత - రాజు దంపతులు మంత్రికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

మంత్రి జన్మదినాన్ని పురస్కరించుకుని గ్రామంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉపాధి హామీ కూలీల మధ్య కేక్ కట్ చేసి స్వీట్లు, చల్ల పాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మహిళా గ్రామ శాఖ అధ్యక్షురాలు సొల్లు స్వప్న సాయిలు మాట్లాడుతూ ప్రజా సేవలో నిరంతరం ముందుండే నాయకుడు పొన్నం ప్రభాకర్ అని కొనియాడారు. యువజన మండల కార్యదర్శి వెన్న మల్లికార్జున్ మాట్లాడుతూ మంత్రి నాయకత్వంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు.

కాంగ్రెస్ కార్యకర్తలు "జై పొన్నం - జై కాంగ్రెస్" నినాదాలతో గ్రామమంతా ఉత్సాహభరిత వాతావరణాన్ని సృష్టించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే నాయకుడిగా మంత్రి గుర్తింపు పొందారని పలువురు నాయకులు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యులు బత్తుల వీరస్వామి, కవిత, వెన్న శారద, సొల్లు రామస్వామి, బత్తుల సారయ్య, భోజ అంజయ్య, బత్తుల కిషన్, శనిగరపు గోపాల్, గొల్లపల్లి వినోద్, నరసయ్య, బత్తుల కనకయ్య, వెన్న శ్రీరామ్, అక్షిత తదితరులు పాల్గొన్నారు.




# ఉపాధి కూలీల సమ్మెను విజయవంతం చేయాలి.!

### జాజిరి శ్రీనివాస్ పిలుపు

**సత్తుపల్లి, మే 8(తెలంగాణ ముచ్చట్లు):** ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీల సమస్యలను పరిష్కరించాలని, ఈ నెల 15న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం సత్తుపల్లి మండలంలోని రామానగరం గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి సమస్యల పరిష్కారం కోసం ఖమ్మం కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాలో పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. వామపక్షాల పోరాటాల ఫలితంగానే యూపీఏ ప్రభుత్వం 2005లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. 2006 అక్టోబర్ నుంచి అమలులోకి వచ్చిన ఈ చట్టం వల్ల కోట్లాది మంది గ్రామీణ పేదలకు ఉపాధి లభించిందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వలసలు తగ్గడమే కాకుండా వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాలు పెరిగాయని చెప్పారు. ఆడ, మగ తేడా లేకుండా సమాన వేతనాలు అమలులోకి రావడం ఉపాధి హామీ చట్టం ద్వారానే సాధ్యమైందన్నారు. కరోనా, ఆర్థిక మాంద్యం వంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రజలను ఆదుకున్నది ఈ చట్టమేనని పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచే చర్యలు చేపట్టిందని ఆరోపించారు. కేంద్రం నిధుల వాటాను తగ్గించి రాష్ట్రాలపై భారం మోపుతోందన్నారు. పని దినాలు పెంచినట్లు ప్రకటించినప్పటికీ వ్యవసాయ సీజన్‌లో పనులు నిలిపివేయడం సరికాదన్నారు. కనీస వేతనాలను పెంచాలని, పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం రామానగరం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో 100 మంది కూలీలకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఒంటెద్దు వెంకటమ్మ, మండల అధ్యక్షురాలు పిల్లి నాగమణి, కార్యదర్శి కువ్వారపు లక్ష్మణరావు, ప్రజానాట్యమండలి నాయకులు అయినంపూడి సుందరరావు, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# జమ్మికుంటలో మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహణ

**జమ్మికుంట టౌన్ మే 08 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పట్టణంలోని గాంధీ చౌరస్తా వద్ద ఈరోజు పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో, సుంకర రమేష్ అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ 59వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు.

అనంతరం జమ్మికుంట పట్టణ శివాలయంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ దేశిని స్వప్నకోటి అధ్యక్షతన మహా అన్నదాన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజల సమస్యలను తమ సమస్యలుగా భావించి ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవాభావంతో ముందుకు సాగుతున్న నాయకుడిగా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారని కొనియాడారు.

బీసీ సంక్షేమం, రవాణా రంగ అభివృద్ధి, సామాన్య ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న ఆయనకు భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించి మరెన్నో ఉన్నత స్థానాలు కల్పించాలని ఆకాంక్షించారు.

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మరింత సేవాభావంతో ప్రజలకు సేవ చేయాలని సభలో పాల్గొన్న డిసిసి వైస్ ప్రెసిడెంట్‌లు, పిసిసి ప్రచార కమిటీ సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లు, మార్కెట్ వైస్ చైర్మన్, మార్కెట్ డైరెక్టర్లు, ఇల్లంతకుంట దేవాలయాల డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆకాంక్షించారు.



# పెద్దమందడి సింగిల్ విండో నూతన సీఈఓ సుధాకర్‌కు ఘన సన్మానం

**పెద్దమందడి,మే8(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి వ్యవసాయ సింగిల్ విండో నూతన సీఈఓగా బాధ్యతలు చేపట్టిన సుధాకర్‌ను పాలకవర్గ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ.. సింగిల్ విండో అభివృద్ధికి నూతన సీఈఓ సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. రైతులకు మరింత మెరుగైన సేవలు అందేలా కృషి చేయాలని కోరారు. సీఈఓ సుధాకర్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచిన పాలకవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.రైతుల సంక్షేమం, సహకార సంఘం అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్, పాలకవర్గ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా రక్తదాతలకు సన్మానం

**వనపర్తి,మే8(తెలంగాణ ముచ్చట్లు):** ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని వనపర్తి రెడ్‌క్రాస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో రక్తదాతలను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. రెడ్‌క్రాస్ ప్రపంచవ్యాప్తంగా మానవతా సేవలు అందిస్తున్న గొప్ప స్వచ్ఛంద సంస్థ అని తెలిపారు. యుద్ధాలు, ప్రకృతి వైపరీత్యాలు, అత్యవసర పరిస్థితుల్లో బాధితులకు సహాయం చేయడం సంస్థ ప్రధాన లక్ష్యమన్నారు.1863లో హెన్రీ డునాంట్ రెడ్‌క్రాస్‌ను స్థాపించారని, ప్రతి సంవత్సరం మే 8న ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని జరుపుకుంటామని చెప్పారు. రక్తదాన శిబిరాలు, వైద్య సేవలు, అంబులెన్స్ సేవల ద్వారా రెడ్‌క్రాస్ సమాజానికి విశేష సేవలు అందిస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో గంధం నాగరాజు, డా. బండారు శ్రీనివాస్, శ్రీ మురళి, వసీం అక్రమ్, గోవిందు, శ్రీమతి లక్ష్మి, సంతోష్‌కుమార్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.



# అకాల వర్షాల హెచ్చరిక.. రైతన్నకు అండగా నిలవాలి

### వరి కొనుగోళ్లు వేగవంతం చేయండి : సీపీఎం నేత కొప్పుల శంకర్

**హుజురాబాద్,మే 8(తెలంగాణ ముచ్చట్లు ):** హుజురాబాద్ మండలంలోని IKP, PACS సెంటర్ల ద్వారా వరి ధాన్యం కొనుగోలు సేకరణను వేగవంతం చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సీపీఎం పార్టీ మండల కార్యదర్శి కొప్పుల శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

వాతావరణ మార్పులతో అకాల వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించి రైతుల పంట నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని కోరారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో రైతులకు టార్పాలిన్లు, పరదాలు అందించడంతో పాటు బార్దానా, హమాలి, ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యాలను వేగవంతంగా కల్పించాలని సూచించారు.

అలాగే కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించిన తర్వాత మిల్లు యాజమాన్యాలు వివిధ కారణాలతో తరుగుదల పేరుతో రైతులను దోపిడీ చేయకుండా అధికారులు కఠినంగా పర్యవేక్షించాలని అన్నారు.

సీపీఎం పార్టీ హుజురాబాద్ మండల కమిటీ ఆధ్వర్యంలో శాలపల్లి, చెల్పూర్, పాపయ్యపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు కదిరే రమేష్, ప్రతాప్ శ్రీనివాస్, కొంకట చంద్రయ్య, రాసపల్లి శంకర్, సారయ్య చిరంజీవి, మహేష్, రవి తదితరులు పాల్గొన్నారు.



# చేతులు సాఫ్ట్‌గా ఉండాలంటే గిన్నెలు కడిగే విధానంలో మార్పులు

**చర్మ రక్షణపై నిపుణుల సూచనలు**

**రోజువారీ అలవాట్లలో చిన్న మార్పులతో మంచి ఫలితాలు**

గిన్నెలు కడిగే పని ప్రతి ఇంటిలోనూ రోజువారీ పనిగా మారింది. అయితే ఈ ప్రక్రియలో చేతులు రఫ్‌గా మారడం, పొడిబారడం వంటి సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. దీని వల్ల చేతుల చర్మం కాంతిని కోల్పోవడమే కాకుండా, కొన్నిసార్లు చిట్లిపోవడం వంటి సమస్యలు కూడా ఉత్పన్నమవుతున్నాయి. వైద్య నిపుణుల ప్రకారం గిన్నెలు కడిగేటప్పుడు ఉపయోగించే సబ్బుల్లో ఉన్న కెమికల్స్ చేతులపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. ఎక్కువసేపు నీటితో సంబంధం ఉండటం వల్ల చర్మంలోని సహజ తేమ తగ్గిపోతుంది. దీంతో చేతులు రఫ్‌గా మారే అవకాశం ఉంది. ఈ సమస్యను తగ్గించడానికి మైల్డ్ డిష్ వాష్ లిక్విడ్ వాడటం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ఆలోవెరా వంటి సహజ పదార్థాలు కలిగిన ఉత్పత్తులు చర్మాన్ని రక్షించడంలో సహాయపడతాయి. అలాగే గిన్నెలు కడిగేటప్పుడు రబ్బర్ గ్లౌవ్స్ వాడటం ద్వారా చేతులను కెమికల్స్ నుంచి కాపాడుకోవచ్చు.

గిన్నెలు కడిగిన వెంటనే చేతులను బాగా తుడిచేసి మాయిశ్చరైజర్ లేదా కొబ్బరి నూనె రాయడం ద్వారా చర్మం సాఫ్ట్‌గా ఉంటుంది. ఇది చేతులలో తేమను నిల్వ ఉంచి చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. చాలా వేడి నీరు వాడటం తగ్గించడం కూడా ముఖ్యం. సహజ పద్ధతుల్లో చక్కెర, తేనె కలిపి చేతులకు రుద్దడం ద్వారా డెడ్ స్కిన్ తొలగిపోతుంది. ఈ విధంగా వారానికి ఒకసారి చేయడం ద్వారా చేతులు మరింత మృదువుగా మారుతాయి. ఇది సులభంగా ఇంట్లోనే చేయగల పద్ధతి. రోజువారీ పనుల్లో చిన్న మార్పులు చేస్తే చేతుల ఆరోగ్యం మెరుగుపడుతుందని నిపుణులు చెబుతున్నారు. సరైన జాగ్రత్తలు తీసుకుంటే గిన్నెలు కడిగినా చేతులు సాఫ్ట్‌గా ఉండడం సాధ్యమని సూచిస్తున్నారు.

**రోజువారీ ఆహారంలో చేర్చితే అనేక లాభాలు**

మొక్కజొన్న మన దేశంలో విస్తృతంగా వినియోగించే ధాన్యాల్లో ఒకటి. తినడానికి రుచిగా ఉండటమే కాకుండా ఆరోగ్యానికి కూడా అనేక ప్రయోజనాలు అందిస్తుంది. తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉండే ఈ ఆహారం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సమానంగా ప్రాధాన్యం పొందుతోంది. మొక్కజొన్నలో కార్బోహైడ్రేట్లు, ఫైబర్, విటమిన్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరానికి అవసరమైన శక్తిని అందించడంతో పాటు జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. ముఖ్యంగా ఫైబర్ ఎక్కువగా ఉండటం వల్ల కడుపు సంబంధిత సమస్యలు తగ్గే అవకాశం ఉంది. నిపుణుల ప్రకారం మొక్కజొన్నను ఆహారంలో చేర్చడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఇందులో ఉన్న యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలో ఉన్న హానికర పదార్థాలను తగ్గించడంలో సహాయపడతాయి. కంటి ఆరోగ్యానికి కూడా ఇది మేలు చేస్తుంది. బరువు నియంత్రణలో కూడా మొక్కజొన్న ఉపయోగపడుతుంది. ఇది తిన్న తర్వాత ఎక్కువసేపు ఆకలి రాకుండా సహాయపడుతుంది. దీంతో అదనపు ఆహారం తీసుకోవడం తగ్గి బరువు నియంత్రణలో ఉంటుంది. మొక్కజొన్నను ఉడికించి, వేయించి లేదా పులుసు రూపంలో తీసుకోవచ్చు. అయితే ఎక్కువగా నూనె, ఉప్పు కలిపి తీసుకోవడం తగ్గించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. సహజంగా తీసుకుంటేనే పూర్తి ప్రయోజనాలు పొందవచ్చు. ఆహారంలో చిన్న మార్పులతో ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. మొక్కజొన్నను నియమితంగా తీసుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన పోషకాలు అందుతాయని సూచిస్తున్నారు.

# మొక్కజొన్నతో ఆరోగ్యం మెరుగుదల





# పండ్లతో ఆరోగ్యం – రోజుకు ఒక ఆపిల్ ఎందుకు అవసరం?

ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో పండ్లు కీలక పాత్ర పోషిస్తాయి. వాటిలో ఆపిల్ ప్రత్యేక స్థానం పొందింది. రోజుకు ఒక ఆపిల్ తింటే వైద్యుడిని దూరంగా ఉంచవచ్చని పాత నానుడి కూడా ఉంది. ఈ పండులో ఉండే పోషకాలు శరీరానికి అవసరమైన శక్తిని అందిస్తాయి. ఆపిల్‌లో విటమిన్ సి, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీర రోగనిరోధక శక్తిని పెంచి అనేక వ్యాధుల నుండి రక్షణ కల్పిస్తాయి. ముఖ్యంగా జీర్ణవ్యవస్థను మెరుగుపరచడంలో ఇది సహాయపడుతుంది. గుండె సంబంధిత సమస్యలను తగ్గించడంలో కూడా ఆపిల్ ఉపయోగపడుతుంది. రక్తంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించి గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుంది. రక్తపోటు నియంత్రణలో కూడా ఇది కీలకంగా పనిచేస్తుంది. బరువు తగ్గాలనుకునేవారికి ఆపిల్ మంచి ఎంపిక. తక్కువ క్యాలరీలు ఉండటంతో పాటు ఎక్కువసేపు ఆకలి తగ్గిస్తుంది. దీనివల్ల అధిక ఆహారం తీసుకునే అలవాటు తగ్గుతుంది. చర్మ సౌందర్యాన్ని పెంచడంలో కూడా ఆపిల్ సహాయపడుతుంది. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని తాజాగా ఉంచి ముడతలను తగ్గించడంలో ఉపయోగపడతాయి. అందువల్ల రోజువారీ ఆహారంలో ఆపిల్‌ను చేర్చుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చు. చిన్న అలవాటు పెద్ద మార్పును తీసుకురాగలదని నిపుణులు సూచిస్తున్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# వీరత్వానికి చిరస్మరణీయ చిహ్నం మహారాణా ప్రతాప్



భారత చరిత్రలో ధైర్యసాహసాలకు ప్రతీకగా నిలిచిన మహారాణా ప్రతాప్ జయంతిని చారిత్రక జన్మదినం ప్రకారం మే 9న దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నారు. రాజస్థాన్‌లోని మేవార్ రాజ్యానికి చెందిన ఈ మహా యోధుడు తన జీవితమంతా రాజ్య గౌరవం కోసం పోరాడి చరిత్రలో చిరస్థాయిగా నిలిచారు. స్వాభిమానాన్ని కాపాడుకోవడం కోసం ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నప్పటికీ ఆయన ఎప్పుడూ వెనుకడుగు వేయలేదు. మహారాణా ప్రతాప్ చిన్ననాటి నుంచే యుద్ధ విద్యల్లో ప్రావీణ్యం సంపాదించారు. గుర్రపు స్వారీ, ఖడ్గయుద్ధం, వ్యూహరచనలో ఆయన అసాధారణ ప్రతిభ కనబరిచారు. ప్రజల పట్ల ప్రేమ, రాజ్య రక్షణ పట్ల నిబద్ధత వల్ల ప్రజల్లో ప్రత్యేక గౌరవం సంపాదించారు. ఆయన నాయకత్వం వల్ల మేవార్ రాజ్యం బలమైన శక్తిగా ఎదిగింది.

మొఘల్ చక్రవర్తి అక్బర్ తన సామ్రాజ్యాన్ని విస్తరించే క్రమంలో అనేక రాజ్యాలను తన ఆధీనంలోకి తీసుకున్నప్పటికీ మహారాణా ప్రతాప్ మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ తలవంచలేదు. రాజపుత్రుల గౌరవం కోసం చివరి శ్వాస వరకు పోరాడాలని సంకల్పించారు. అదే ఆయనను భారత చరిత్రలో ప్రత్యేక వ్యక్తిగా నిలబెట్టింది. హల్దీఘాటి యుద్ధం మహారాణా ప్రతాప్ జీవితంలో అత్యంత కీలక ఘట్టంగా భావిస్తారు. తక్కువ సైన్యం ఉన్నప్పటికీ శత్రువులను ధైర్యంగా ఎదుర్కొన్నారు. యుద్ధ సమయంలో ఆయన ప్రదర్శించిన వ్యూహాలు ఇప్పటికీ చరిత్రకారులను ఆశ్చర్యపరుస్తుంటాయి. ఆ యుద్ధంలో ఆయన గుర్రం చేతక్ చూపిన విశ్వాసం గురించి ఇప్పటికీ ఎంతో గౌరవంగా చెప్పుకుంటారు. యుద్ధాల కారణంగా ఎన్నో ఇబ్బందులు ఎదురైనా మహారాణా ప్రతాప్ తన ప్రజలను విడిచిపెట్టలేదు. అడవుల్లో జీవిస్తూ కూడా రాజ్య రక్షణ కోసం పోరాటం కొనసాగించారు. రాజసౌఖ్యాలను త్యాగం చేసి ప్రజల కోసం జీవించిన నాయకుడిగా ఆయనకు ప్రత్యేక స్థానం ఉంది. కష్టసమయంలో కూడా ధైర్యం కోల్పోకూడదని ఆయన జీవితం తెలియజేస్తుంది. మహారాణా ప్రతాప్ వ్యక్తిత్వంలో దేశభక్తి, నిజాయితీ, ఆత్మగౌరవం ప్రధాన లక్షణాలుగా కనిపిస్తాయి. రాజ్యాన్ని కాపాడుకోవడం కోసం ఆయన చేసిన త్యాగాలు యువతకు ఇప్పటికీ స్ఫూర్తినిస్తాయి. దేశం కోసం పోరాడే ధైర్యం, స్వాభిమానం ప్రతి ఒక్కరిలో ఉండాలని ఆయన జీవితం సూచిస్తుంది.

మహారాణా ప్రతాప్ జయంతి సందర్భంగా రాజస్థాన్‌తో పాటు దేశంలోని అనేక ప్రాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విద్యాసంస్థలు, సామాజిక సంస్థలు, చరిత్రాభిమానులు ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్నారు. ఆయన జీవిత చరిత్రపై ఉపన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా జరుగుతున్నాయి. భారత చరిత్రలో మహారాణా ప్రతాప్ పేరు ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోతుందని చరిత్రకారులు పేర్కొంటున్నారు. స్వేచ్ఛ, గౌరవం కోసం రాజీ పడకుండా పోరాడిన ఆయన జీవితం తరతరాలకు ఆదర్శంగా నిలుస్తోంది. ధైర్యం, దేశభక్తి, త్యాగం వంటి విలువలను సమాజానికి అందించిన మహా యోధుడిగా మహారాణా ప్రతాప్‌ను దేశ ప్రజలు గౌరవంగా స్మరించుకుంటున్నారు.

# భక్తి, ఆధ్యాత్మికతకు ప్రతీకగా కాలాష్టమి

హిందూ సంప్రదాయంలో అత్యంత పవిత్రమైన ఆధ్యాత్మిక దినాలలో కాలాష్టమి ఒకటి. ప్రతి నెల కృష్ణ పక్ష అష్టమి రోజున ఈ పర్వదినాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. ముఖ్యంగా కాలభైరవ స్వామిని ఆరాధించే వారికి ఈ రోజు ప్రత్యేక ప్రాధాన్యత కలిగి ఉంటుంది. శివుడి ఉగ్రరూపంగా భావించే కాలభైరవ స్వామి అనుగ్రహం కోసం భక్తులు ఉపవాసాలు పాటిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. పురాణాల ప్రకారం కాలభైరవుడు శివుని శక్తివంతమైన అవతారంగా భావిస్తారు. చెడు శక్తులను నాశనం చేసి ధర్మాన్ని కాపాడే దైవంగా ఆయనకు ప్రత్యేక స్థానం ఉంది. కాలం, కర్మ, నియమశాసనాలకు అధిపతిగా భావించే కాలభైరవ స్వామి భక్తుల కష్టాలను తొలగిస్తారని విశ్వాసం. అందుకే కాలాష్టమి రోజున ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తారు.

కాలాష్టమి సందర్భంగా తెల్లవారుజాము నుంచే భక్తులు శివాలయాలు, కాలభైరవ ఆలయాలకు చేరుకుని ప్రత్యేక దర్శనాలు చేసుకుంటారు. కొందరు భక్తులు నిరాహార దీక్షలు పాటిస్తూ రాత్రి వరకు జాగరణ నిర్వహిస్తారు. భైరవ అష్టకం, శివ స్తోత్రాలు, మంత్రాల పారాయణంతో ఆలయాలు ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోతాయి. హిందూ ఆధ్యాత్మిక సంప్రదాయంలో కాలాష్టమికి ప్రత్యేక స్థానం ఉంది. భయం, అశాంతి, ప్రతికూల పరిస్థితుల నుంచి విముక్తి లభిస్తుందని భక్తులు విశ్వసిస్తారు. కాలభైరవ స్వామిని భక్తితో ప్రార్థిస్తే జీవితం సక్రమ మార్గంలో నడుస్తుందని పండితులు చెబుతున్నారు. అందుకే యువత నుంచి వృద్ధుల వరకు అనేక మంది ఈ పర్వదినాన్ని ఆచరిస్తున్నారు. కాలాష్టమి రోజున కుక్కలకు ఆహారం పెట్టడం కూడా ప్రత్యేకమైన ఆచారంగా భావిస్తారు. కాలభైరవ స్వామి వాహనం కుక్క అని పురాణాల్లో పేర్కొనబడింది. అందుకే భక్తులు కుక్కలకు ఆహారం అందిస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు. కొందరు పేదలకు అన్నదానాలు కూడా చేస్తుంటారు. ప్రస్తుత కాలంలో ఆధ్యాత్మికతకు ప్రజలు మరింత ప్రాధాన్యత ఇస్తున్నారు. ఒత్తిడి, ఆందోళనల మధ్య మనసుకు ప్రశాంతత కలిగించే మార్గంగా భక్తి భావనను చాలా మంది స్వీకరిస్తున్నారు. కాలాష్టమి వంటి పర్వదినాలు ఆధ్యాత్మిక చింతనకు దారితీస్తూ మనిషిలో ధైర్యం, నమ్మకాన్ని పెంచుతున్నాయని ఆధ్యాత్మికవేత్తలు చెబుతున్నారు. దేశంలోని ప్రముఖ కాలభైరవ ఆలయాల్లో ఈ సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అధికారులు భద్రతా చర్యలు చేపడుతున్నారు. ఆలయ పరిసరాల్లో భజనలు, హోమాలు, ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తున్నారు. కాలాష్టమి కేవలం పూజలకు మాత్రమే పరిమితమయ్యే రోజు కాదు. ధర్మం, నియమం, సమయపాలన వంటి విలువలను గుర్తు చేసే ఆధ్యాత్మిక సందర్భంగా కూడా దీనిని భావిస్తారు. భక్తి మార్గంలో నడుస్తూ మానసిక ప్రశాంతతను పొందాలని ఈ పర్వదినం ప్రతి ఒక్కరికీ సందేశం ఇస్తోంది.

# ప్రపంచాన్ని మార్చిన విషాద గాథ ద్వితీయ ప్రపంచ యుద్ధం



ప్రపంచ చరిత్రలో ఎన్నో యుద్ధాలు జరిగినప్పటికీ ద్వితీయ ప్రపంచ యుద్ధం మానవ సమాజాన్ని అత్యంతగా కుదిపేసిన ఘోర సంఘటనగా నిలిచిపోయింది. 1939 నుంచి 1945 వరకు కొనసాగిన ఈ యుద్ధం కోట్లాది మంది జీవితాలను చీకటిలోకి నెట్టింది. దేశాల మధ్య ఆధిపత్య పోరు, రాజకీయ విభేదాలు, అధికారం కోసం జరిగిన పోటీ చివరికి ప్రపంచాన్ని రక్తపాతం వైపు నడిపించింది. లక్షలాది సైనికులు మాత్రమే కాదు, అమాయక ప్రజలు కూడా ఈ యుద్ధంలో బలయ్యారు. నగరాలు శిథిలాలుగా మారాయి. మానవ విలువలు నేలమట్టమయ్యాయి. అందుకే ద్వితీయ ప్రపంచ యుద్ధ స్మృతి దినం కేవలం ఒక జ్ఞాపక దినం కాదు. యుద్ధం అనే విపత్తు మానవాళికి ఎంతటి నష్టాన్ని కలిగిస్తుందో గుర్తు చేసే గంభీరమైన సందర్భం. ద్వితీయ ప్రపంచ యుద్ధం ప్రారంభమైన కాలంలో ప్రపంచం రాజకీయ అస్థిరతతో నిండిపోయి ఉంది. జర్మనీ, ఇటలీ, జపాన్ వంటి దేశాలు తమ ఆధిపత్యాన్ని విస్తరించేందుకు ప్రయత్నించగా మరోవైపు మిత్రదేశాలు వాటిని అడ్డుకునేందుకు యుద్ధరంగంలోకి దిగాయి. ఒక్కో దేశం తమ ప్రయోజనాల కోసం తీసుకున్న నిర్ణయాలు చివరకు ప్రపంచవ్యాప్తంగా విధ్వంసానికి దారితీశాయి. ఆ కాలంలో జరిగిన యుద్ధాలు కేవలం సరిహద్దులకే పరిమితం కాలేదు. సముద్రాలు, ఆకాశం, పట్టణాలు అన్నీ యుద్ధభూములుగా మారిపోయాయి. ప్రతి క్షణం మరణభయంతో ప్రజలు జీవించారు.

ఈ యుద్ధం మానవ చరిత్రలో అత్యంత విషాదకరమైన అంశాలలో ఒకటైన సామూహిక హత్యలకు కూడా కారణమైంది. లక్షలాది మంది యూదులను నిర్దాక్షిణ్యంగా హత్య చేసిన ఘటనలు ప్రపంచాన్ని కలవరపరిచాయి. మతం, జాతి పేరుతో మనుషులను హింసించడం ఎంత అమానుషమో ప్రపంచం ప్రత్యక్షంగా చూసింది. నిర్బంధ శిబిరాల్లో జరిగిన దారుణాలు ఇప్పటికీ చరిత్రలో నల్ల అక్షరాలతో నిలిచిపోయాయి. మానవ హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం వంటి విలువలు ఎంత ముఖ్యమో ఈ ఘటనలు ప్రపంచానికి స్పష్టంగా తెలియజేశాయి.

ద్వితీయ ప్రపంచ యుద్ధంలో అణుబాంబుల వినియోగం ప్రపంచాన్ని మరింత భయాందోళనలకు గురిచేసింది. జపాన్‌లోని హిరోషిమా, నాగసాకి నగరాలపై పడిన అణుబాంబులు క్షణాల్లో లక్షలాది ప్రాణాలను బలి తీసుకున్నాయి. ఆ నగరాల్లో జరిగిన విధ్వంసం మానవ చరిత్రలో ఎన్నటికీ మరచిపోలేని దృశ్యంగా మిగిలిపోయింది. యుద్ధం విజయం సాధించడానికి ఉపయోగించిన ఆయుధాలు చివరకు మానవత్వాన్నే ప్రశ్నించే స్థితికి తీసుకెళ్లాయి. ఆ సంఘటనల తర్వాత ప్రపంచం అణ్వాయుధాల ప్రమాదాన్ని తీవ్రంగా గుర్తించింది. యుద్ధం ముగిసిన తర్వాత కూడా దాని ప్రభావం ఎన్నో దశాబ్దాల పాటు కొనసాగింది. ఆర్థిక వ్యవస్థలు దెబ్బతిన్నాయి. లక్షలాది కుటుంబాలు జీవనాధారాన్ని కోల్పోయాయి. చిన్నారులు అనాథలయ్యారు. యుద్ధం ముగిసినా మానసిక గాయాలు మాత్రం ఎన్నో తరాల వరకు వెంటాడాయి. ఆ బాధలను మోస్తూనే అనేక దేశాలు తిరిగి అభివృద్ధి దిశగా ప్రయాణం ప్రారంభించాయి. అదే సమయంలో ప్రపంచ దేశాలు మరోసారి ఇలాంటి పరిస్థితులు రాకుండా ఐక్యరాజ్యసమితి వంటి వేదికలను బలోపేతం చేశాయి.

అయితే ప్రపంచం చరిత్ర నుంచి పూర్తిగా పాఠాలు నేర్చుకుందా అనే ప్రశ్న ఇప్పటికీ మిగిలే ఉంది. నేటికీ ప్రపంచంలోని కొన్ని ప్రాంతాల్లో యుద్ధాలు కొనసాగుతూనే ఉన్నాయి. సరిహద్దు వివాదాలు, మత ఘర్షణలు, రాజకీయ ఆధిపత్య పోరాటాలు ఇంకా మానవాళిని వెంటాడుతూనే ఉన్నాయి. ఆధునిక సాంకేతికత, అణ్వాయుధాలు, క్షిపణి వ్యవస్థలు మరింత ప్రమాదకర స్థాయికి చేరుకున్న ఈ కాలంలో మరో ప్రపంచ యుద్ధం జరిగితే దాని ప్రభావం ఊహించలేనిదిగా ఉండొచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఈ నేపథ్యంలో ద్వితీయ ప్రపంచ యుద్ధ స్మృతి దినం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన వారిని స్మరించుకోవడం మాత్రమే కాదు, మానవత్వాన్ని కాపాడుకోవడం కూడా ఈ రోజు ప్రధాన సందేశంగా నిలుస్తోంది. దేశాల మధ్య విభేదాలు చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని, హింస ఎప్పటికీ శాశ్వత పరిష్కారం కాదని ప్రపంచ నాయకులు గుర్తించాల్సిన అవసరం ఉంది. శాంతి, సహనం, పరస్పర గౌరవం వంటి విలువలు బలపడితేనే ప్రపంచం సురక్షితంగా ముందుకు సాగుతుంది. యువతకు యుద్ధ చరిత్రను తెలియజేయడం అత్యంత అవసరం. యుద్ధాల వల్ల ప్రపంచం ఎదుర్కొన్న నష్టాన్ని అర్థం చేసుకున్నప్పుడే భవిష్యత్ తరాలు శాంతి మార్గాన్ని ఎంచుకునే అవకాశం ఉంటుంది. విద్యాసంస్థలు, సామాజిక సంస్థలు, ప్రభుత్వాలు ఈ అంశంపై మరింత అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉంది. చరిత్రను కేవలం చదవడం కోసం కాకుండా, అదే తప్పులు మళ్లీ జరగకుండా నివారించడానికి ఉపయోగించుకోవాలి.

ద్వితీయ ప్రపంచ యుద్ధం మానవాళికి ఒక గంభీరమైన హెచ్చరిక. అధికారం, ద్వేషం, అసహనం చివరకు వినాశనానికే దారితీస్తాయని ప్రపంచానికి ఈ యుద్ధం నేర్పింది. కోట్లాది మంది త్యాగాలను స్మరించుకుంటూ ప్రపంచం శాంతి, మానవత్వం, సామరస్యానికి కట్టుబడి ఉండాల్సిన అవసరం మరింత పెరిగింది. భవిష్యత్ తరాలు యుద్ధ భయాలు లేకుండా జీవించాలంటే ప్రతి దేశం శాంతి మార్గాన్నే ఎంచుకోవాల్సిన సమయం ఇదే.

# మూసీ పునర్జీవం పనులకు వేగం

- క్యాబినెట్ సబ్ కమిటీ కీలక నిర్ణయాలు
- ప్రజల ఇళ్లకు నష్టం లేకుండా ప్రణాళిక
- 2027 నాటికి ప్రాజెక్టు పూర్తి లక్ష్యం



**హైదరాబాద్, మే 8 (తెలంగాణ ముచ్చట్లు):** మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అధ్యక్షతన మూసీ పునర్జీవం ప్రాజెక్టుపై క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌తో పాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మూసీ నది పునరుజ్జీవనం కేవలం అభివృద్ధి ప్రాజెక్టు మాత్రమే కాదని, అది నగరవాసుల సామాజిక బాధ్యత అని కమిటీ స్పష్టం చేసింది. అభివృద్ధి పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేయకుండా వారిని భాగస్వాములను చేస్తూ ముందుకు సాగాలని అధికారులకు సూచనలు జారీ చేసింది. ప్రజల ఆస్తులు, నివాసాలకు కనీస నష్టం కూడా కలగకుండా ప్రాజెక్టు అలైన్‌మెంట్‌ను అవసరమైతే మార్చుకోవాలని కమిటీ ఆదేశించింది. ఫేజ్ 1 కోసం సుమారు ₹7,055 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పనులకు ఆసియా అభివృద్ధి బ్యాంక్ నుంచి నిధులు సమకూర్చుకునేందుకు జరిగిన చర్చలు విజయవంతమైనట్లు వెల్లడించారు.

హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 21 కిలోమీటర్ల పరిధిలో తొలి ఐదు కిలోమీటర్ల పనులను వెంటనే ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ ప్రాంతంలో ఎటువంటి ఆవాసాలు లేకపోవడంతో ప్రారంభ దశ పనులను వేగంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. మూసీ నదిలో నీటి నిల్వ పెంపుతో పాటు పర్యాటక రంగాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో రబ్బర్ డ్యామ్ నమూనాలను మంత్రులు పరిశీలించారు. అలాగే నదిలో వ్యర్థాల తొలగింపు, రివర్ బెడ్ ప్రొఫైలింగ్, వరద నియంత్రణ గోడలు, రోడ్ల నిర్మాణం, మురుగు కాలువలు, బ్యారేజీల ఏర్పాటు వంటి పనులను ప్రాధాన్యంగా చేపట్టాలని నిర్ణయించారు.

నార్సింగి నుంచి గౌరెల్లి వరకు 55 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణాన్ని కూడా ప్రాజెక్టులో భాగంగా చేపట్టనున్నారు. 2026 ఆగస్టు నాటికి అన్ని అనుమతులు పూర్తి చేసి పనులు ప్రారంభించి, 2027 డిసెంబర్ నాటికి మొత్తం ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఐఐటి, జేఎన్‌టీయూ వంటి సాంకేతిక సంస్థల సహకారంతో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులు చేపట్టాలని మంత్రులు అధికారులకు సూచించారు. ఈ ప్రాజెక్టు హైదరాబాద్ నగర రూపురేఖలను మార్చడమే కాకుండా పర్యావరణ పరిరక్షణలో కూడా కీలక మైలురాయిగా నిలుస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆశాభావం వ్యక్తం చేశారు.

## కృష్ణానగర్ వరద సమస్యకు శాశ్వత పరిష్కారం

- నెల రోజుల్లో ఉపశమనం కల్పిస్తాం
- పనులను పరిశీలించిన హైడ్రా కమిషనర్

**హైదరాబాద్, మే 8 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రతి ఏడాది వరద ముప్పుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కృష్ణానగర్ ప్రాంత ప్రజలకు ఈసారి ఉపశమనం కలిగించేలా చర్యలు తీసుకుంటున్నామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. భారీ వర్షాల సమయంలో వరద నీరు సాఫీగా వెళ్లేలా కాలువల్లో పూడికతీత పనులను వేగవంతం చేసినట్లు వెల్లడించారు. స్థానిక ఎమ్మెల్యే నవీన్ యాదవ్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌తో కలిసి హైడ్రా కమిషనర్ కృష్ణానగర్‌లో జరుగుతున్న డీసిల్టింగ్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దాదాపు ఒకటిన్నర కిలోమీటర్ల పొడవున్న వరద కాలువను పూర్తిగా అధ్యయనం చేసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. మీడియాతో మాట్లాడిన ఏవీ రంగనాథ్.. జూబ్లీహిల్స్, వెంకటగిరి ప్రాంతాల నుంచి వరద నీటితో పాటు భారీగా మట్టి చేరి కాలువల్లో పేరుకుపోవడంతో సమస్య తీవ్రమవుతోందన్నారు. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీతో కలిసి హైడ్రా భాగస్వామ్యంగా పూడికతీత పనులు చేపడుతోందని చెప్పారు. వరద ముప్పుకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రత్యామ్నాయ కాలువ నిర్మాణంపై కూడా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

కాలువల్లో ఆరు నుంచి ఏడు అడుగుల మేర పూడిక పేరుకుపోవడంతో వరద నీరు రహదారులపైకి వస్తోందన్నారు. ఎనిమిది నుంచి తొమ్మిది అడుగుల లోతున్న కాలువల్లో పూడిక తొలగించేందుకు అవసరమైన చోట్ల స్లాబులను తొలగించాల్సి వస్తోందని పేర్కొన్నారు. పనులు పూర్తయ్యాక అక్కడ బలమైన గ్రిల్స్ ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కాలువలపై కొన్ని నిర్మాణాలు ఉన్నట్లు గుర్తించామని, తప్పనిసరి పరిస్థితుల్లోనే తొలగింపు చర్యలు తీసుకుంటామని కమిషనర్ స్పష్టం చేశారు. ముందుగా నోటీసులు ఇచ్చి తగిన సమయం కల్పిస్తామని తెలిపారు. గతంలో పూర్తి స్థాయిలో పూడికతీత జరగకపోవడంతో సమస్య మళ్లీ తలెత్తిందని స్థానికులు చెబుతున్నట్లు పేర్కొన్నారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే పనులు పూర్తి చేసే లక్ష్యంతో వేసవి కాలంలోనే డీసిల్టింగ్ ప్రారంభించామని అధికారులు తెలిపారు. హైడ్రా అదనపు సంచాలకులు వర్ల పాపయ్యతో పాటు హైడ్రా, జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు ఈ పరిశీలనలో పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# భవిష్యత్ సవాళ్లకు సిద్ధంగా ఉండాలి

దేశ భద్రతా పరిస్థితులు వేగంగా మారుతున్న నేపథ్యంలో భారత సాయుధ దళాలు భవిష్యత్ సవాళ్లకు ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉండాలని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సూచించారు. రాజస్థాన్‌లోని జైపూర్‌లో నిర్వహించిన సంయుక్త కమాండర్ల సమావేశంలో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు.
ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న భౌగోళిక, రాజకీయ అనిశ్చిత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సైన్యం అత్యాధునిక వ్యూహాలతో ముందుకు సాగాలని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, వేగవంతమైన నిర్ణయాలు, సమన్వయంతో దేశ రక్షణ వ్యవస్థ మరింత బలపడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా "ఆపరేషన్ సిందూర్" మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సైనిక నాయకత్వాన్ని రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు. ఆపరేషన్ సిందూర్ భారత సాయుధ దళాల వేగవంతమైన, కచ్చితమైన చర్యలకు నిదర్శనమని కొనియాడారు. దేశ భద్రత విషయంలో భారత సైన్యం అత్యున్నత స్థాయి అప్రమత్తతతో పనిచేస్తోందని కేంద్ర మంత్రి అన్నారు. భవిష్యత్ యుద్ధ పరిస్థితులను ఎదుర్కొనేలా దళాలు సన్నద్ధంగా ఉండాలని సూచించారు.
సైనిక ఆధునీకరణ, వ్యూహాత్మక ప్రణాళికలు, అంతర్జాతీయ పరిస్థితులపై సమావేశంలో విస్తృతంగా చర్చించినట్లు సమాచారం. భారత సాయుధ దళాల సామర్థ్యం ప్రపంచవ్యాప్తంగా మరింత గుర్తింపు పొందుతోందని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.




# స్వదేశీ గ్లైడ్ బాంబు 'తారా' విజయవంత పరీక్ష

దేశ రక్షణ రంగంలో మరో కీలక ముందడుగు పడింది. స్వదేశీ సాంకేతికతతో రూపొందించిన కొత్త తరహా గ్లైడ్ వెపన్ సిస్టమ్ "తారా"ను రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ డీఆర్డీవో విజయవంతంగా పరీక్షించింది. ఒడిశా తీర ప్రాంతంలో నిర్వహించిన ఈ ప్రయోగం విజయవంతం కావడంతో భారత రక్షణ సామర్థ్యాలు మరింత బలపడినట్లు అధికారులు వెల్లడించారు. "తారా" అంటే "టాక్టికల్ అడ్వాన్స్‌డ్ రేంజ్ ఆగుమెంటేషన్" అని పేర్కొన్నారు. ఇది ఒక ఆధునిక గ్లైడ్ బాంబు వ్యవస్థ. సంప్రదాయ వార్‌హెడ్స్‌తో పనిచేసే ఈ ఆయుధం లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో ధ్వంసం చేయగలదని రక్షణ నిపుణులు తెలిపారు. గాల్లో నుంచి వదిలిన తర్వాత ఈ బాంబు గ్లైడింగ్ పద్ధతిలో ప్రయాణిస్తూ నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకుంటుంది. డీఆర్డీవోతో పాటు భారత వైమానిక దళం సంయుక్తంగా ఈ ప్రయోగాన్ని నిర్వహించాయి. హైదరాబాదులోని రీసెర్చ్ సెంటర్ ఇమారత్ ఈ వ్యవస్థ అభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషించింది. డీఆర్డీవోకు చెందిన మరికొన్ని ప్రయోగశాలలు కూడా ఈ ప్రాజెక్టులో కీలకంగా పనిచేశాయి. స్వదేశీయంగా అభివృద్ధి చేసిన తొలి గ్లైడ్ వెపన్ సిస్టమ్ ఇదేనని కేంద్ర రక్షణ శాఖ వెల్లడించింది. సాధారణ బాంబులతో పోలిస్తే గ్లైడ్ వెపన్లు ఏరోడైనమిక్ విధానంలో పనిచేస్తాయి. బాంబును వదిలిన తర్వాత అది గాల్లో కొంత దూరం స్వయంగా ప్రయాణిస్తూ లక్ష్యాన్ని చేరుతుంది. దీని వల్ల దాడి చేసే యుద్ధవిమానాలు శత్రు ప్రాంతానికి అత్యంత సమీపంగా వెళ్లాల్సిన అవసరం తగ్గుతుంది. దీంతో భద్రతా పరంగా కూడా ఇది ఎంతో ఉపయోగకరంగా భావిస్తున్నారు. తారా వ్యవస్థను "మాడ్యులార్ రేంజ్ ఎక్స్‌టెన్షన్ కిట్"గా అభివృద్ధి చేశారు. దిశా నిర్దేశం లేని సాధారణ బాంబులను కూడా ఈ సాంకేతికత ద్వారా లక్ష్యాన్ని చేరే విధంగా మారుస్తుంది. తక్కువ ఖర్చుతో అధునాతన దాడి సామర్థ్యాన్ని అందించే ఈ వ్యవస్థ భారత రక్షణ రంగానికి కీలక బలంగా మారనుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. భారత్ స్వదేశీ ఆయుధ తయారీలో వేగంగా ముందుకు సాగుతున్న తరుణంలో "తారా" విజయవంత పరీక్ష మరో మైలురాయిగా నిలిచింది. భవిష్యత్తులో ఇలాంటి ఆధునిక ఆయుధ వ్యవస్థలు భారత సైనిక శక్తిని మరింత బలోపేతం చేయనున్నాయని రక్షణ వర్గాలు పేర్కొంటున్నాయి.



# ఢిల్లీ, హర్యానాలో ఉగ్రదాడుల కుట్ర భగ్నం

దేశ రాజధాని ఢిల్లీతో పాటు హర్యానాలో భారీ ఉగ్రదాడులకు పాకిస్థాన్‌కు చెందిన ఐఎస్ఐ కుట్ర పన్నిన విషయం వెలుగులోకి వచ్చింది. ఢిల్లీ-సోనిపట్ హైవేపై ఉన్న ప్రముఖ దాబా, హర్యానాలోని మిలిటరీ క్యాంప్, ఢిల్లీలోని ఓ ప్రముఖ ఆలయాన్ని లక్ష్యంగా చేసుకుని దాడుల ప్రణాళిక రూపొందించినట్లు దర్యాప్తులో బయటపడింది. ఈ కుట్రను షహజాద్ భట్ మాడ్యూల్‌కు చెందిన ఆపరేటివ్‌ల ద్వారా అమలు చేయాలని ప్రయత్నించినట్లు అధికారులు గుర్తించారు. ఇప్పటికే ఈ మాడ్యూల్‌కు సంబంధం ఉన్న తొమ్మిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఢిల్లీ పోలీసు స్పెషల్ సెల్ అధికారులు నిందితులను విచారించగా కీలక సమాచారం బయటపడినట్లు తెలుస్తోంది.
పోలీసుల సమాచారం ప్రకారం.. నిందితుల్లో ఒకరు ఢిల్లీలోని ప్రముఖ ఆలయం వద్ద రెక్కీ నిర్వహించారు. అక్కడి భద్రతా ఏర్పాట్లు, సిబ్బంది కదలికలు, పరిసర ప్రాంతాల ఫొటోలను సోషల్‌మీడియా వేదికల ద్వారా పాకిస్థాన్‌లో ఉన్న హ్యాండ్లర్లకు పంపినట్లు అధికారులు గుర్తించారు. ఈ సమాచారం ఆధారంగా ఉగ్రదాడుల ప్రణాళిక సిద్ధం చేసినట్లు అనుమానిస్తున్నారు. ఆలయం వద్ద మోహరించిన భద్రతా సిబ్బందిపై కాల్పులు జరిపి భయాందోళనలు సృష్టించాలని కుట్ర పన్నినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. ప్రజలు ఎక్కువగా ఉండే ప్రాంతాలను లక్ష్యంగా ఎంచుకుని దేశంలో అశాంతి సృష్టించడమే ఉద్దేశ్యంగా భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ, హర్యానాలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఈ కేసులో ఇంకా మరికొంత మంది ప్రమేయం ఉన్న అవకాశం ఉందని దర్యాప్తు సంస్థలు భావిస్తున్నాయి. దేశ భద్రతకు ముప్పు కలిగించే కుట్రలను ముందుగానే భగ్నం చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం అరెస్టైన నిందితుల నుంచి మరిన్ని వివరాలు సేకరిస్తూ దర్యాప్తు కొనసాగిస్తున్నారు.




# చిట్టగాంగ్ తీరానికి చేరుకున్న భారత నౌక

భారత మహాసముద్ర నౌక "ఐఓఎస్ సాగర్" బంగ్లాదేశ్‌లోని చిట్టగాంగ్ నౌకాశ్రయానికి విజయవంతంగా చేరుకుంది. బంగాళాఖాతంలో విజయవంతమైన ప్రయాణం అనంతరం ఈ నౌక చిట్టగాంగ్ హార్బర్‌లోకి ప్రవేశించినట్లు ఢాకాలోని భారత హైకమిషన్ వెల్లడించింది. "ఐఓఎస్ సాగర్ 2026" బహుళ దేశాల నౌకాదళ విన్యాసాల్లో భాగంగా ఈ పర్యటన జరుగుతోంది. ఈ సందర్భంగా భారత నౌకాదళం, బంగ్లాదేశ్ నౌకాదళాల మధ్య ఉన్న బలమైన స్నేహబంధం మరోసారి స్పష్టమైందని అధికారులు పేర్కొన్నారు. బంగ్లాదేశ్ జలాల్లోకి ప్రవేశించిన ఐఓఎస్ సాగర్‌కు బంగ్లాదేశ్ నౌకాదళానికి చెందిన బీఎన్ఎస్ అలీ హైదర్ ఎఫ్-17 నౌక ఘన స్వాగతం పలికింది. అనంతరం ఆ నౌకను చిట్టగాంగ్ నౌకాశ్రయానికి ఎస్కార్ట్ చేస్తూ తీసుకెళ్లారు. ఈ పర్యటన ద్వారా రెండు దేశాల నౌకాదళాల మధ్య సమన్వయం, సముద్ర భద్రతా సహకారం మరింత బలపడుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు. ప్రాంతీయ భద్రత, సముద్ర మార్గాల రక్షణలో భారత్-బంగ్లాదేశ్ భాగస్వామ్యం కీలకంగా మారుతోందని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ నౌకా పర్యటన ఇరు దేశాల మధ్య దౌత్య, రక్షణ సంబంధాలను మరింత బలోపేతం చేసే అడుగుగా భావిస్తున్నారు. బంగాళాఖాత ప్రాంతంలో సహకారం పెంపు దిశగా ఇది ముఖ్యమైన పరిణామంగా నిలిచింది.




# వారణాసిలో థర్మల్ పవర్ భద్రత సదస్సు

థర్మల్ పవర్ రంగ భద్రతను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో సీఐఎస్ఎఫ్ ఈస్టర్న్ సెక్టార్ జోన్2 ఆధ్వర్యంలో ఉత్తర ప్రదేశ్‌లోని వారణాసిలో "థర్మల్ పవర్ సెక్టార్ సెక్యూరిటీ-2026" పేరుతో ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్, ఎన్టీపీసీ అధికారులు, పరిశ్రమ నిపుణులు పాల్గొన్నారు. ఈ వర్క్‌షాప్‌కు సీఐఎస్ఎఫ్ డీఐజీ మనీష్‌సింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భద్రతా రంగంలో ఎదురవుతున్న కొత్త సవాళ్లు, కీలక విద్యుత్ మౌలిక సదుపాయాల రక్షణ, సాంకేతిక ఆధారిత భద్రతా పరిష్కారాలపై ఆయన పాల్గొన్నవారితో చర్చించారు.
సీఐఎస్ఎఫ్ అధికారులు భద్రతా నిర్వహణలో ఎదురైన కీలక సమస్యలపై కేస్ స్టడీలు ప్రదర్శించారు. ఎన్టీపీసీ అధికారులు "విజన్ 2050" లక్ష్యాలను వివరిస్తూ భవిష్యత్ విద్యుత్ రంగ అభివృద్ధి, భద్రతా అవసరాలపై తమ అభిప్రాయాలు వెల్లడించారు. ప్రైవేట్ రంగ నిపుణులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలపై ప్రత్యేక ప్రజెంటేషన్లు ఇచ్చారు. కృత్రిమ మేధస్సు, యంత్ర అధ్యయనం ఆధారిత నిఘా వ్యవస్థలు, డ్రోన్లు, యాంటీ డ్రోన్ సిస్టమ్స్, స్మార్ట్ కమాండ్ సొల్యూషన్ల వినియోగంపై వివరించారు. చివరిగా నిర్వహించిన "సీఐఎస్ఎఫ్ విజన్ 2047" ప్రత్యేక సమావేశంలో భవిష్యత్ భద్రతా వ్యూహాలపై చర్చించారు. సాంకేతికత, పరస్పర సహకారంతో దేశ విద్యుత్ మౌలిక వసతులను మరింత సురక్షితంగా మార్చేందుకు కట్టుబడి ఉన్నామని అధికారులు స్పష్టం చేశారు.

# గిఫ్ట్ సిటీలో విమాన లీజింగ్ సదస్సు ప్రారంభం

గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీలో రెండో ఇండియా ఎయిర్‌క్రాఫ్ట్ లీజింగ్ అండ్ ఫైనాన్సింగ్ సమ్మిట్ ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్‌మోహన్ నాయుడు, గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రామ్‌మోహన్ నాయుడు మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ ఆలోచనతో రూపుదిద్దుకున్న గిఫ్ట్ సిటీ ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక రంగానికి భారత దేశ ద్వారంగా మారిందన్నారు. అంతర్జాతీయ విమాన లీజింగ్ సంస్థల నుంచి భారీ స్థాయిలో పాల్గొనడం భారతదేశంపై పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమని తెలిపారు. భారత పౌర విమానయాన రంగం అపూర్వ వృద్ధి దశలో ఉందని, రాబోయే ఐదేళ్లలో భారతీయ ఎయిర్‌లైన్స్ సంస్థలు 500కు




పైగా విమానాలను తమ సేవల్లోకి తీసుకురానున్నాయని వెల్లడించారు. ఈ నేపథ్యంలో భారీ పెట్టుబడి భారం లేకుండా విమానాల విస్తరణ, ఆధునీకరణకు లీజింగ్ వ్యవస్థ అత్యంత కీలకమవుతుందని పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి లీజింగ్, ఫైనాన్సింగ్ వ్యవస్థను భారత్‌లో ఏర్పాటు చేయడం ద్వారా దేశాన్ని గ్లోబల్ ఏవియేషన్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. గిఫ్ట్ సిటీ ఈ లక్ష్య సాధనలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. విమాన లీజింగ్ రంగంలో భారత్‌ను అంతర్జాతీయ కేంద్రంగా మార్చేందుకు పరిశ్రమ వర్గాలతో కలిసి చర్చలు జరపనున్నట్లు రామ్‌మోహన్ నాయుడు వెల్లడించారు. దేశీయ విమానయాన రంగ భవిష్యత్తుకు ఈ సదస్సు కీలక మలుపుగా మారనుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక




# గుండెల్ని తాకే 'గోదారి గట్టుపైన'

'మేం ఫేమస్' చిత్రంతో యువతకు చేరువైన సుమంత్ ప్రభాస్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన తాజా కుటుంబ కథా చిత్రం 'గోదారి గట్టుపైన' నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. దర్శకుడు సుభాష్ చంద్ర తెరకెక్కించిన ఈ సినిమా గోదావరి తీర ప్రాంత నేపథ్యంతో, తండ్రీకూతుళ్ల అనుబంధాన్ని హృదయానికి హత్తుకునేలా చూపిస్తూ ప్రేక్షకులను భావోద్వేగాలకు గురిచేస్తోంది. ప్రేమ, కుటుంబ విలువలు, బాధ్యతల మధ్య జరిగే సంఘర్షణను దర్శకుడు సహజంగా ఆవిష్కరించిన తీరు ఆకట్టుకుంటోంది.

కోనసీమలోని ఓ చిన్న గ్రామంలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేసే శ్యామ్ బాబు పాత్రలో జగపతి బాబు కనిపిస్తారు. తన కూతురు మాయ అంటే ప్రాణంగా చూసుకునే తండ్రిగా ఆయన నటన సినిమాకు ప్రధాన బలంగా నిలిచింది. ఆటో డ్రైవర్ రాజు పాత్రలో సుమంత్ ప్రభాస్ సహజ నటనతో ఆకట్టుకున్నాడు. ముఖ్యంగా గోదావరి యాసలో ఆయన పలికించిన సంభాషణలు ప్రేక్షకులను మెప్పిస్తున్నాయి. మాయ పాత్రలో నటించిన నిధి ప్రదీప్ తొలి సినిమానే అయినప్పటికీ భావోద్వేగ సన్నివేశాల్లో మంచి ప్రతిభ కనబరిచింది.

సినిమా మొదటి భాగం ప్రేమకథ, సరదా సన్నివేశాలు, గ్రామీణ వాతావరణంతో ఆహ్లాదకరంగా సాగుతుంది. రెండో భాగంలో మాత్రం కథ పూర్తిగా కుటుంబ భావోద్వేగాల వైపు మళ్లుతుంది. తండ్రి ప్రేమ, కూతురు భవిష్యత్తు, ప్రేమలో వచ్చే అడ్డంకులు వంటి అంశాలను దర్శకుడు బలంగా చూపించారు. ముఖ్యంగా క్లైమాక్స్‌లో వచ్చే భావోద్వేగ సన్నివేశాలు ప్రేక్షకులను కదిలిస్తాయి. కథలో పెద్దగా కొత్తదనం లేకపోయినా, భావోద్వేగాలను సహజంగా చూపించడం సినిమాకు బలమైంది. కొన్ని చోట్ల కథనం నెమ్మదించిన భావన కలిగించినా, కుటుంబ ప్రేక్షకులకు ఈ చిత్రం మంచి అనుభూతిని ఇస్తుంది. మొత్తంగా 'గోదారి గట్టుపైన' ఎలాంటి ఆర్భాటాలు లేని స్వచ్ఛమైన కుటుంబ కథా చిత్రంగా నిలిచింది. వేసవి సెలవుల్లో కుటుంబంతో కలిసి చూడదగ్గ మంచి భావోద్వేగ చిత్రమని చెప్పొచ్చు.



# 'సతీ లీలావతి' ఎలా ఉందంటే?

వివాహం తర్వాత కొంత విరామం తీసుకున్న లావణ్య త్రిపాఠి నటించిన తాజా కుటుంబ కథా చిత్రం 'సతీ లీలావతి' నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. భార్యాభర్తల మధ్య పెరుగుతున్న దూరాలు, అపార్థాలు, భావోద్వేగాల నేపథ్యంలో దర్శకుడు తాతినేని సత్య ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. అయితే ఈ సినిమా ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుందో ఇప్పుడు చూద్దాం. కథ విషయానికి వస్తే.. ప్రముఖ దర్శకురాలు లీలావతి చిన్ననాటి భయాలతో మానసికంగా ఇబ్బంది పడుతూ ఉంటుంది. సైకాలజిస్ట్ రామ్ సేతు సహాయంతో ఆ సమస్యల నుంచి బయట పడిన ఆమె, చివరకు అతడినే ప్రేమించి వివాహం చేసుకుంటుంది. కానీ పెళ్లైన కొన్నేళ్ల తర్వాత సేతు మరో మహిళతో ప్రేమలో ఉన్నానని చెప్పి విడాకులు కోరుతాడు. దీంతో లీలావతి తీసుకున్న నిర్ణయం వారి జీవితాలను ఎలా మార్చింది? చివరకు ఈ దంపతుల బంధం ఏ దిశగా వెళ్లింది? అనేదే సినిమా ప్రధాన కథ. సినిమాలో లావణ్య త్రిపాఠి నటన ప్రధాన ఆకర్షణగా నిలిచింది. భావోద్వేగ సన్నివేశాల్లో ఆమె నటన సహజంగా అనిపిస్తుంది. భర్తతో సంబంధం దెబ్బతిన్న మహిళ పాత్రలో మంచి అభినయం కనబరిచారు. దేవ్ మోహన్ తన పాత్ర పరిధిలో నటించాడు. నరేష్, పవిత్ర లోకేష్, సప్తగిరి తదితరులు తమ పాత్రలకు న్యాయం చేశారు. దర్శకుడు చెప్పాలనుకున్న అంశం మంచిదే అయినప్పటికీ, కథనంలో కొత్తదనం లేకపోవడం సినిమాకు పెద్ద లోపంగా మారింది. మొదటి భాగం కొంతవరకు ఆసక్తికరంగా సాగినా, రెండో భాగంలో కథ గందరగోళంగా మారుతుంది. అవసరం లేని ట్రాక్స్, బలహీనమైన మలుపులు సినిమాను నెమ్మదింపజేస్తాయి. ముఖ్యంగా హాస్య సన్నివేశాలు ఆశించిన స్థాయిలో పనిచేయలేదు. సాంకేతికంగా చూస్తే సంగీత దర్శకుడు మిక్కీ జే మేయర్ అందించిన నేపథ్య సంగీతం సినిమాకు బలం చేకూర్చింది. ఛాయాగ్రహణం కూడా ఆకట్టుకుంటుంది. నిర్మాణ విలువలు బాగున్నాయి.

# జ్యోతి రాయ్ మెరుపులు..

బుల్లితెర నటి జ్యోతి రాయ్ మరోసారి తన గ్లామర్ ఫొటో షూట్‌తో సామాజిక మాధ్యమాల్లో సందడి చేస్తోంది. 'గుప్పెడంత మనసు' ధారావాహిక ద్వారా తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన ఈ అందాల నటి, ఇప్పుడు వెబ్ సిరీస్‌లు మరియు సినిమాలతో బిజీగా మారింది. నటనతో పాటు తన అందంతోనూ అభిమానులను ఆకట్టుకుంటున్న జ్యోతి రాయ్ తాజా ఫొటోలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. తాజాగా పూల డిజైన్ గౌనులో జ్యోతి చేసిన ఫొటో షూట్ అభిమానులను కట్టిపడేస్తోంది. సహజమైన అందం, స్టైలిష్ లుక్‌తో ఆమె ఇచ్చిన పోజులు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ముఖ్యంగా చిరునవ్వుతో కనిపించిన ఆమె ఫొటోలకు అభిమానులు పెద్ద ఎత్తున స్పందిస్తున్నారు. 'గుప్పెడంత మనసు' ధారావాహికలో రిషి తల్లి జగతి పాత్రలో నటించిన జ్యోతి రాయ్, తన అద్భుత నటనతో ప్రేక్షకుల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. వయసుకు



మించిన పాత్రలో ఎంతో సహజంగా నటించి ప్రశంసలు అందుకుంది. ప్రస్తుతం ధారావాహికలకు దూరంగా ఉంటూ సినిమాలు, వెబ్ సిరీస్‌లలో ప్రధాన పాత్రలు పోషిస్తోంది. ఇటీవల ఆమె ప్రధాన పాత్రలో నటించిన 'కిల్లర్' చిత్రం కూడా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. ఇక తాజా ఫొటో షూట్‌తో మరోసారి అభిమానులను అలరిస్తూ సామాజిక మాధ్యమాల్లో ట్రెండింగ్‌గా మారింది.



# 47లోనూ అదే అందం.. తన డైట్ సీక్రెట్ చెప్పిన భూమిక

ఒకప్పుడు తెలుగు సినీ పరిశ్రమలో స్టార్ కథానాయికగా వెలుగొందిన భూమిక చావ్లా ఇప్పటికీ అదే అందం, ఫిట్‌నెస్‌తో అభిమానులను ఆకట్టుకుంటోంది. 47 ఏళ్ల వయసులోనూ ఎంతో యంగ్‌గా కనిపిస్తున్న భూమిక తాజాగా తన ఆరోగ్య రహస్యాలను, రోజువారీ జీవనశైలిని అభిమానులతో పంచుకుంది.

ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆమె తన డైట్ ప్లాన్, ఫిట్‌నెస్ అలవాట్ల గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించింది. 'యువకుడు' సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన భూమిక, 'ఖుషీ', 'ఒక్కడు', 'సింహాద్రి', 'వాసు', 'మిస్సమ్మ' వంటి ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో నటించి ప్రత్యేక గుర్తింపు సంపాదించింది. పెళ్లి తర్వాత కొంతకాలం సినిమాలకు దూరమైన ఆమె, ఇప్పుడు మళ్లీ కీలక పాత్రలతో ప్రేక్షకుల ముందుకు వస్తోంది. తన అందం వెనుక ఎలాంటి ఖరీదైన డైట్‌లు లేదా కఠినమైన నియమాలు లేవని భూమిక తెలిపింది. తాను పూర్తిగా శాఖాహారినని, ఇంట్లో తయారుచేసిన సాధారణ ఆహారానికే ప్రాధాన్యం ఇస్తానని చెప్పింది. ఆహారంలో మసాలాలు చాలా తక్కువగా ఉంటాయని, ఏది తిన్నా మితంగా తినడమే తన ఆరోగ్య రహస్యమని వెల్లడించింది ప్రతిరోజూ యోగా, వాకింగ్ తప్పకుండా చేస్తానని భూమిక చెప్పింది.

మానసిక ప్రశాంతత కోసం యోగా ఎంతో ఉపయోగపడుతుందని, శరీరాన్ని ఫిట్‌గా ఉంచుకోవడానికి స్విమ్మింగ్ కూడా చేస్తానని తెలిపింది. ఎక్కువగా నీరు తాగడం, తాజా పండ్లు తీసుకోవడం తన అలవాటని పేర్కొంది. సరైన నిద్ర కూడా ఆరోగ్యానికి చాలా ముఖ్యమని భూమిక వెల్లడించింది. రాత్రి 10:30 లోపే నిద్రపోవడానికి ప్రయత్నిస్తానని, తగినంత విశ్రాంతి లేకపోతే చిరాకు వస్తుందని చెప్పింది. మనసు ప్రశాంతంగా ఉంటేనే చర్మం కాంతివంతంగా ఉంటుందని ఆమె అభిప్రాయపడింది.

ఇక ప్రస్తుతం భూమిక మరోసారి సినిమాల్లో బిజీ అవుతోంది. ఇటీవల తల్లి పాత్రల్లోనూ తన నటనతో ఆకట్టుకుంటున్న ఆమె, మంచి కథలు వస్తే మరిన్ని తెలుగు సినిమాల్లో నటించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపింది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in